వాయిస్ అఫ్ ప్రజలు

# వాయిస్ టుడే

TGTEL/25/A2649

www.Voicetodaynews.com

https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 10

మంగళవారం, డిసెంబరు 9, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## అమెరికా మార్కెట్‌లో భారత్ బియ్యం.. సుంకాలతో చెక్ : ట్రంప్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వాణిజ్య యుద్ధానికి సంకేతాలు పంపారు. భారత్ నుంచి దిగుమతి అవుతున్న బియ్యం, కెనడా నుంచి వస్తున్న ఎరువులపై కొత్తగా సుంకాలు విధించే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు. వైట్‌హౌస్‌లో అమెరికా రైతులకు 12 బిలియన్ డాలర్ల భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్, కెనడాలతో వాణిజ్య చర్చల్లో ఆశించిన పురోగతి లేకపోవడంతో ట్రంప్ ఈ నిర్ణయం వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా భారత్ బియ్యం దిగుమతుల వల్ల అమెరికాలోని స్థానిక రైతులు నష్టపోతున్నారని ఆయన ఆరోపించారు. సమావేశంలో ఒక రైతు మాట్లాడుతూ.. అమెరికా రిటైల్ మార్కెట్లో రెండు అతిపెద్ద రైస్ బ్రాండ్లు భారత్ కంపెనీలవేనని చెప్పగా, ట్రంప్ వెంటనే స్పందించారు.




# తెలంగాణ నెం.1

## పదేళ్లలో తెలంగాణను ప్రపంచస్థాయి రాష్ట్రంగా మారుస్తాం: సీఎం రేవంత్

- జీడీపీలో తెలంగాణ వాటాను 2047 నాటికి 10 శాతానికి పెంచే లక్ష్యం
- చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ మోడళ్లు ప్రేరణ
- 'తెలంగాణ రైజింగ్ -2047' దార్శనిక పథకం ఆవిష్కరణ
- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లే ప్రణాళిక
- సేవలు, తయారీ, వ్యవసాయ రంగాలను 3 విభాగాలుగా అభివృద్ధి
- క్యూర్, ప్యూర్, రేర్ మోడళ్లతో ప్రాంతాలవారీగా అభివృద్ధి లక్ష్యాలు
- ప్రభుత్వ-నిపుణుల సూచనలతో భవిష్యత్తు రోడ్‌మ్యాప్ సిద్ధం

TELANGANA RISING 2047

హైదరాబాద్: తెలంగాణను రాబోయే పదేళ్లలో దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందినదిగా, ప్రపంచంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రస్తుతం జీడీపీలో 5 శాతంగా ఉన్న రాష్ట్ర వాటాను 2047 నాటికి 10 శాతానికి చేర్చడమే తమ సంకల్పమని చెప్పారు. హైదరాబాద్‌లో జరిగిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ – 2025' ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి కీలక ప్రసంగం చేశారు. అభివృద్ధి విషయంలో చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ వంటి మహా దేశాల పురోగతి

(మిగతా 2వ పేజీలో)

## టెక్నాలజీ శిఖరాగ్రంలో ప్రపంచం కానీ మనసుల్లో మాత్రం దారిద్ర్యం



- ఎన్నడూ లేనంతగా టెక్నాలజీ అభివృద్ధి, కానీ మానవ విలువలలో పడిపోతున్న ప్రపంచం
- తీవ్రవాదం, విభజన, విద్వేష రాజకీయాలు పెరుగుతున్నాయన్న కైలాష్ సత్యార్థి ఆందోళన
- సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనే శాంతి-పరిష్కారాలకు మార్గం
- తెలంగాణ దార్శనిక అభివృద్ధిని నోబెల్ గ్రహీత ప్రశంస



## రాష్ట్ర అభివృద్ధికి విద్యుత్ కీలకం: భట్టి

- పరిశ్రమల నుంచి జీవన ప్రమాణాల వరకు దాని ప్రభావం
- హైదరాబాద్ అతి పెద్ద ఈ-బస్సు వినియోగ నగరం
- మరో 20 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ప్రణాళిక
- 2047 నాటికి 1.39 లక్షల మెగావాట్ల విద్యుత్ అవసరం

## 2026 ఏడాదికి సెలవులు ఖరారు చేసిన తెలంగాణ ప్రభుత్వం

27 సాధారణ సెలవులు, 26 ఐచ్ఛిక సెలవులు తెలంగాణ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి

భోగి మొదలు క్రిస్మస్ మరుసటి రోజు వరకు 27 సాధారణ సెలవులు



## భారతీయులను లక్ష్యంగా చేసుకోబోమని హామీ ఇవ్వాలి: చైనాకు భారత విదేశాంగ శాఖ గట్టి సందేశం

చైనాకు, లేదా ఆ దేశం మీదుగా రాకపోకలు సాగించే భారతీయులకు సూచనలు

బీజింగ్ కూడా భారత ప్రయాణికుల విషయంలో సక్రమంగా వ్యవహరించాలని సందేశం

ఏకపక్షంగా నిర్బంధించడం, వేధించడం చేయవద్దన్న విదేశాంగ శాఖ

## 300 వార్డులుగా జీహెచ్ఎంసీ

వార్డుల పునర్ నిర్ధారణకు సర్కారు ఆమోదం.. ఉత్తర్వులు జారీ

అభ్యంతరాలు స్వీకరించనున్న కమిషనర్.. నేడో, రేపో నోటిఫికేషన్?




హైదరాబాద్ , డిసెంబరు 8 : తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్(టీ–క్యూర్) వరకు విస్తరించిన జీహెచ్ఎంసీని 300 వార్డులుగా పునర్ నిర్ధారించారు. 2 వేల చదరపు కిలోమీటర్లకు పైగా విస్తీర్ణంలో ఉన్న ప్రాంతాలకు సంబంధించి వార్డుల(డివిజన్) హద్దులను పునర్ నిర్ధారిస్తూ(రీ ఫిక్సేషన్), కార్పొరేటర్ల సంఖ్యను తేలుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం మెట్రోపాలిటన్ ఏరియా అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం ఉత్తర్వులు(జీవో 266) విడుదల చేశారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ)తో కలిసి జీహెచ్ఎంసీ వార్డుల పునర్ వ్యవస్థీకరణపై సమగ్ర అధ్యయనం చేసింది. అనంతరం బల్దియా కమిషనర్ సమర్పించిన నివేదికను పరిశీలించిన ప్రభుత్వం 300 వార్డులను నోటిఫై చేసింది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల, ఆవల ఉన్న 20 మునిసిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తూ గత బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో టీ–క్యూర్ వరకు జీహెచ్ఎంసీ పునర్విభజనపై అధికారులు సుదీర్ఘ కసరత్తు చేశారు. 300 వార్డుల ఏర్పాటుతో వార్డుకు ఒకరు చొప్పున 300 మంది కార్పొరేటర్లుగా ఎన్నిక కానున్నారు. మొన్నటి వరకు 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న జీహెచ్ఎంసీలో 150 వార్డులు, 30 సర్కిళ్లు, ఆరు జోన్లు ఉండేవి. విస్తరించిన జీహెచ్ఎంసీలో వార్డుల సంఖ్య 300కు పెరిగింది. 10 వరకు జోన్లు, 50 వరకు సర్కిళ్లు ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. సర్కారు ఉత్తర్వుల నేపథ్యంలో పునర్విభజనపై జీహెచ్ఎంసీ కమిషనర్ అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించనున్నారు. దీనికి సంబంధించి మంగళ లేదా బుధవారాల్లో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది

## 'వందేమాతరం'పై నెహ్రూది విశ్వాస ఘాతం : ప్రధాని మోదీ



- జిన్నా ఒత్తిడికి లొంగి వందేమాతరాన్ని కుదించి ముక్కలు చేశారని మోదీ ఆరోపణ
- ముస్లింలను రెచ్చగొట్టేలా ఉందని ముఖ్య చరణాలు తొలగించారని విమర్శ
- సామాజిక సామరస్యమేనని చెప్పి బుజ్జగింపు రాజకీయాలు నడిపారని ఆరోపణ
- వందేమాతరం గౌరవం తగ్గించడంతో చివరకు దేశం విభజనకు దారితీసిందని వ్యాఖ్య
- గాంధీ కోరినా గీతానికి న్యాయం చేయలేదని మోదీ వ్యథ
- వందేమాతరం స్వాతంత్ర్య పోరాటానికి శక్తినిచ్చిన మహామంత్రమని గుర్తుచేసిన ప్రధాని
- 150 ఏళ్ల వందేమాతరం వైభవాన్ని ప్రజలు తిరిగి తెలుసుకోవాలన్న ఆహ్వానం
- ప్రతిపక్షాల దాడులు, విమర్శల మధ్యలో కూడా మోదీ ధీటుగా సమాధానాలు

# తెలంగాణ నెం. 1



తమకు స్ఫూర్తి అని, ఆ దేశాలత్తో పోటీ పడే స్థాయికి తెలంగాణను తీసుకెళ్లాలని భావిస్తున్నామని స్పష్టం చేశారు. "దేశానికి స్వాతంత్య్రం వచ్చాక నాయకులు రాజ్యాంగం రూపకల్పన ద్వారా రోడ్‌మ్యాప్ వేశారు. అదే విధంగా, తెలంగాణ భవిష్యత్తు కోసం మేమూ దార్శనిక పథకాన్ని రూపొందించాలని నిర్ణయించుకున్నాం. ప్రజల అభిప్రాయాలు, నిపుణుల సూచనలు, ప్రభుత్వ యంత్రాంగం సహకారంతో 'తెలంగాణ రైజింగ్ %–% 2047'కు బీజం పడింది" అని సీఎం వివరించారు. 2014లో సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ నాయకత్వంలో రాష్ట్ర కల నిజమైందని, ఆ తెలంగాణను ఇప్పుడు మరింత శక్తివంతమైన, సుస్థిర అభివృద్ధి రాష్ట్రంగా తీర్చిదిద్దడం తమ లక్ష్యమని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్లకు పెంచే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్ణయించింది. దేశ జనాభాలో రాష్ట్ర జనాభా 2.9 శాతం మాత్రమే అయినా, జీడీపీలో 5 శాతం వాటా తెలంగాణదే అని వివరించారు.

విజన్–2047లో భాగంగా రాష్ట్రాన్ని మూడు ప్రధాన అభివృద్ధి ప్రాంతాలుగా విభజించామని చెప్పారు: క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) – నగర ప్రాంతాల అభివృద్ధి ప్యూర్ (పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ) –నగర పరిసరాల పురోభివృద్ధి రేర్ – (గ్రామీణ%–%వ్యవసాయ రంగాల బలోపేతం. ప్రతి ప్రాంతానికి ప్రత్యేక అభివృద్ధి లక్ష్యాలు, పెట్టుబడి అవకాశాలు, వనరుల వినియోగ విధానాలు నిర్దేశించిన మొదటి రాష్ట్రం తెలంగాణేనని ముఖ్యమంత్రి గర్వంగా తెలిపారు. సదస్సుకు హాజరైన వ్యాపారవేత్తలు, విధాననిర్ణేతలు, దౌత్యవేత్తలు, నిపుణుల సూచనలు స్వాగతించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. "తెలంగాణలో అపారమైన అవకాశాలు ఉన్నాయి. సానుకూల వాతావరణం ఉంది. ఈ ప్రయాణంలో అందరూ భాగస్వాములు కావాలి" అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# రాష్ట్ర అభివృద్ధికి విద్యుత్ కీలకం: భట్టి

**రైతులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సీఐఐ-టీవీఎస్ ప్రణాళిక**

**ఆరోగ్య రంగంలో అపోలో 1,700 కోట్ల పెట్టుబడి**

**అదానీ గ్రూప్ నుండి భారీ గ్రీన్‌డేటా సెంటర్ ప్రాజెక్టు**


**వరల్డ్ ఎకనమిక్ ఫోరం తెలంగాణతో భాగస్వామ్యాన్ని కొనసాగించనున్నట్టు వెల్లడింపు**



హైదరాబాద్: రాష్ట్రం 2047 నాటికి చేరుకోవాలనుకున్న 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ విజన్‌కు విద్యుత్ రంగమే మౌలిక శక్తి అని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గ్లోబల్ సమ్మిట్–2025లో భాగంగా ఫ్యూచర్ సిటీలో నిర్వహించిన 'ద జస్ట్ ట్రాన్సిషన్ ఇన్‌టు 2047: పవరింగ్ తెలంగాణ ఫ్యూచర్' చర్చాగోష్టిలో ఆయన మాట్లాడారు. పారిశ్రామీకరణ, ఉద్యోగావకాశాలు, వ్యవసాయ రంగ ఉత్తేజం, నగరాల్లో జీవన ప్రమాణాల మెరుగుదల%–% ఇవన్నీ విద్యుత్ వ్యవస్థ పటిష్టతపై ఆధారపడిన అంశాలని భట్టి పేర్కొన్నారు. అందుకే రాష్ట్ర అభివృద్ధి వ్యూహంలో వాతావరణ చర్యలు, ఇంధన మార్పును ప్రధాన స్తంభాలుగా నిలిపామని చెప్పారు. ప్రస్తుత 11.4 గిగావాట్ల విద్యుత్ సామర్థ్యానికి తోడు మరో 20 గిగావాట్ల పునరుత్పాదక విద్యుదుత్పత్తి లక్ష్యంతో ఇప్పటికే రోడ్‌మ్యాప్ సిద్ధమైందని తెలిపారు. 2030 నాటికి హైదరాబాద్‌ను దేశంలోనే అత్యధిక ఈ–బస్సులు నడిచే నగరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. 2047 నాటికి పారిశ్రామికాభివృద్ధి అవసరాలకు అనుగుణంగా రాష్ట్రానికి 1.39 లక్షల మెగావాట్ల కంటే ఎక్కువ విద్యుత్ అవసరం ఉంటుందని అంచనా వేశారు. దీనికి తగినట్టు పునరుత్పాదక ఇంధనాలతో పాటు నిల్వ సౌకర్యాలు, థర్మల్ సామర్థ్యం, డిజిటల్ గ్రిడ్‌లు, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేస్తామని భట్టి తెలిపారు. తెలంగాణ భవిష్యత్ కార్యాచరణలో పట్టణాల్లో పచ్చదనం విస్తరణ, తక్కువ కర్బన ఉద్గారాలతో పరిశ్రమల అభివృద్ధి కూడా ముఖ్య భాగాలేనని వెల్లడించారు. ఈ చర్చాగోష్టిలో ఇదం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కో–ఫౌండర్ అజిత్ పండిట్, ఎన్టీపీసీ గ్రీన్ సీఈఓ సరిత్ మహేశ్వరి, హరీశ యార్లగడ్డ, మహ్మద్ సైఫ్, నేత్రా వాల్కవాకర్, ప్రొ. రాజ్‌కిరణ్ తదితరులు ప్యానెల్ స్పీకర్లుగా పాల్గొన్నారు.

# టెక్నాలజీ శిఖరాగ్రంలో ప్రపంచం.. కానీ మనసుల్లో మాత్రం దారిద్ర్యం!

**తీవ్రవాదం, విభజన, విద్వేష రాజకీయాలు పెరుగుతున్నాయన్న కైలాష్ సత్యార్థి ఆందోళన**



ప్రపంచం ఎన్నడూ లేనంతగా టెక్నాలజీ, ఐటీ రంగాల పురోగతి సాధించిన ఈ సమయంలోనే మానవత్వం మాత్రం దారుణంగా తగ్గిపోతోందని నోబెల్ పురస్కార గ్రహీత కైలాష్ సత్యార్థి ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యూచర్ సిటీలో జరిగిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2025' ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యోపన్యాసం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా తీవ్రవాదం, విభజన, విద్వేష రాజకీయాలు పెరుగుతున్నాయని, మానవ విలువలు కనుమరుగైపోతున్నాయన్న ఆందోళన వ్యక్తం చేశారు. "మానవత్వం ప్రమాదంలో పడింది, శాంతి ప్రమాదంలో పడింది. వినూత్న పరిష్కారాలను వెతకాల్సిన సమయం ఇది" అని అన్నారు. సుస్థిర ఆర్థిక అభివృద్ధి లక్ష్యాల సాధనే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారమని, ఈ దిశగా తెలంగాణ మంచి ముందడుగు వేసిందని ప్రశంసించారు. తన ప్రసంగంలో సత్యార్థి, "రెండు సంవత్సరాల్లో 20 లక్షలమందికి పైగా రైతుల రుణ మాఫీ, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, విద్య%–%వైద్య రంగాల ప్రక్షాళన%ౌ% ఇవన్నీ ఎలా సాధ్యమయ్యాయి?" అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదగడం అసాధ్యం కాదని తెలిపారు. "దేశంలో 100 కోట్ల సమస్యలుంటే, వాటికి 130 కోట్ల మంది ప్రజలే పరిష్కారం" అని వ్యాఖ్యానించారు.

**రైతులను పారిశ్రామికవేత్తలుగా చేస్తాం: టీవీఎస్ ఛైర్మన్ దినేశ్**

సీఐఐ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 5,000–10,000 మంది రైతులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని టీవీఎస్ సప్లై చైన్ సొల్యూషన్స్ ఛైర్మన్ ఆర్. దినేశ్ తెలిపారు. తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో టీవీఎస్ గ్రూప్ భాగస్వామ్యం అవుతుందని చెప్పారు.

**1,700 కోట్ల పెట్టుబడులు : అపోలో శోభన కామినేని**

వచ్చే మూడు సంవత్సరాల్లో ప్రోటాన్ ఆధారిత ఇన్నోవేషన్ కేంద్రం సహా పలు ఆరోగ్య సేవల కోసం 1,700 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్టు అపోలో ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ శోభన కామినేని తెలిపారు. 'జెమినాయ్' అనే కొత్త ఏఐ వైద్యసేవను కూడా పరిచయం చేశారు.

**2,500 కోట్ల గ్రీన్‌డేటా సెంటర్: కరణ్ అదానీ**

రాష్ట్రంలో 48 మెగావాట్ సామర్థ్యంతో గ్రీన్‌డేటా సెంటర్ నిర్మించేందుకు 2,500 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదానీ ప్రకటించారు. అత్యాధునిక ఏఐ, క్లౌడ్ టెక్నాలజీలతో ఈ కేంద్రం పనిచేయనుందని తెలిపారు.

**"తెలంగాణతో భాగస్వామ్యం కొనసాగుతుంది": వరల్డ్ ఎకనమిక్ ఫోరం**

వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఫ్రాంటియర్ టెక్నాలజీస్ మరియు సైబర్ సెక్యూరిటీ విభాగాల అధిపతి జెరెమీ జుర్గెన్స్ మాట్లాడుతూ తెలంగాణ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని, తమ భాగస్వామ్యం భవిష్యత్తులో మరింత బలపడుతుందని అన్నారు. దావోస్, బయోఏసియా సదస్సుల్లో సీఎం రేవంత్‌ను కలుసుకోవాలని ఎదురుచూస్తున్నామన్నారు.

**చిన్న అడుగులే పెద్ద విజయాలకు మార్గం. అభిజీత్ బెనర్జీ**

నోబెల్ గ్రహీత, ఆర్థికవేత్త అభిజీత్ బెనర్జీ మాట్లాడుతూ "ప్రతి ఒక్కరినీ అభివృద్ధిలో భాగస్వాములుగా చేయడమే కీలకం. చిన్న చిన్న సరికొత్త అడుగులే భారీ లక్ష్యాలను సాధించే బాట చూపుతాయి" అని అన్నారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యం సాధ్యం కావడానికి చేయాల్సింది ముందుగా స్పష్టమైన ఆలోచన, సరైన దిశ నిర్ణయం అని చెప్పారు.

# 'వందేమాతరం'పై నెహ్రూది విశ్వాస ఘాతం : ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: లోక్‌సభలో వందేమాతరం 150వ వార్షికోత్సవంపై జరిగిన ప్రత్యేక చర్చను ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ, ఈ పవిత్ర గీతానికి కాంగ్రెస్ పార్టీ పెద్ద అన్యాయం చేసిందని తీవ్రంగా మండిపడ్డారు. జవహర్‌లాల్ నెహ్రూ, మహమ్మద్ అలీ జిన్నా ఒత్తిడికి లొంగిపోయి వందేమాతరంలోని కీలక చరణాలు తొలగించారని మోదీ ఆరోపించారు. ముస్లింలను రెచ్చగొడుతుందన్న పేరుతో గీతాన్ని కుదించడమే అసలైన బుజ్జగింపు రాజకీయమని విమర్శించారు. నెహ్రూ నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు రాసిన లేఖలో కూడా ఇదే వ్యాఖ్యలున్నాయని మోదీ గుర్తుచేశారు. 1937లో కోల్‌కతాలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ వందేమాతరం గొప్పదనమేంటని సమీక్షకు పెట్టడం దేశాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేసిందని అన్నారు. అప్పుడు కాంగ్రెస్ పట్ల దేశ వ్యాప్తంగా నిరసనలు జరిగాయని చెప్పారు. "బంకించంద్ర చటర్జి 1875లో రాసిన వందేమాతరం స్వాతంత్ర్య సమరయోధులకు శక్తినిచ్చింది. బ్రిటిష్ పాలకులు ఎన్నో కుట్రలు చేసినా ఈ గీతం శిలలా నిలిచింది. 1905లో బెంగాల్ విభజనకు కూడా కారణం ఇదే శక్తి" అని మోదీ వివరించారు. మహాత్మా గాంధీ సైతం వందేమాతరాన్ని మరింత గౌరవ స్థాయికి చేర్చాలని కోరినా, కాంగ్రెస్ నేతలు దానికి అనుకూలంగా వ్యవహరించలేదని విమర్శించారు. దేశానికి సవాళ్లు ఎదురైనప్పుడల్లా వందేమాతరం ఇచ్చిన స్ఫూర్తితో భారతం ఎదిగిందని మోదీ పేర్కొన్నారు. "యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలు, కోవిడ్%–19 ప్రతీసారి ఈ గీతమే మనకు బలం. 2047 వికసిత్ భారత్ లక్ష్యానికి వందేమాతరం మన మంత్రం" అని చెప్పారు. తృణమూల్ ఎంపీలు ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయగా మోదీ స్పందిస్తూ, "కాంగ్రెస్ విధానాలను ఔట్‌సోర్సింగ్‌గా తీసుకున్నట్లున్నారు" అని చురకలు అంటించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా వందేమాతరం భారతీయ విలువల ప్రతీక అని చెప్పారు. అయితే ప్రతిపక్షాలు బీజేపీపై తీవ్రమైన విమర్శలు గుప్పించాయి. అఖిలేశ్ యాదవ్ బీజేపీకి వందేమాతరం అర్థమే తెలియదని, డీఎంకే ఎంపీ ఎ.రాజా గీతాన్ని హిందువులకే పరిమితం చేసిందనే వాదననే వివాదానికి మూలమన్నారు. తృణమూల్ ఎంపీ మహువా మొయిత్రా బెంగాల్ ఎన్నికల కోసం వందేమాతరం ఉద్యమంగా ఉపయోగిస్తున్నారని ఆరోపించారు.





## డీజీసీఏ నోటీసులపై ఇండిగో స్పందన

**ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు**

**విమానాల రద్దుకు ప్రాథమికంగా ఐదు కారణాలు వెల్లడి**

**పూర్తిస్థాయి విశ్లేషణకు మరింత సమయం కావాలని వినతి**

విమాన సర్వీసుల అంతరాయంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) జారీ చేసిన షోకాజ్ నోటీసుకు ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో స్పందించింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నట్లు తెలిపింది. ఈ గందరగోళానికి దారితీసిన పూర్తి స్థాయి కారణాలను విశ్లేషించేందుకు తమకు మరింత సమయం కావాలని కోరింది. ఈ మేరకు సంస్థ సీఈవో, సీఓఓల సంతకాలతో కూడిన వివరణను డీజీసీఏకు సమర్పించింది. డిసెంబర్ ఆరంభంలో తమ విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం కలగడానికి ప్రాథమికంగా ఐదు అంశాలు కారణమని ఇండిగో తన నివేదికలో పేర్కొంది. స్వల్ప సాంకేతిక సమస్యలు, విమానాల షెడ్యూళ్లలో మార్పులు, ప్రతికూల వాతావరణం, విమానయాన వ్యవస్థలో పెరిగిన రద్దీ వంటివి తమ నెట్‌వర్క్‌పై ప్రభావం చూపాయని వివరించింది. వీటికి తోడు కొత్తగా అమల్లోకి వచ్చిన 'ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ (ఎఫ్‌డీటీఎల్) ఫేజ్ II' నిబంధనలు కూడా ఇబ్బందులకు ఒక కారణమని తెలిపింది. ఈ కారణాలన్నీ కలిసి తమ ఆన్–టైమ్ పనితీరును దెబ్బతీశాయని ఇండిగో పేర్కొంది. దీంతో నెట్‌వర్క్‌ను పునరుద్ధరించి, ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు 'నెట్‌వర్క్ రీబూట్' లాంటి కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని, ఫలితంగా పెద్ద సంఖ్యలో విమానాలను రద్దు చేయాల్సి వచ్చిందని వివరించింది. ప్రస్తుతం పరిస్థితి సంక్లిష్టంగా ఉన్నందున, పూర్తి స్థాయి 'రూట్ కాజ్ అనాలిసిస్' (ఆర్‌సీఏ)చేయడానికి డీజీసీఏ నిబంధనల ప్రకారం 15 రోజుల గడువు ఇవ్వాలని కోరింది. విచారణ పూర్తయిన వెంటనే సమగ్ర నివేదిక సమర్పిస్తామని హామీ ఇచ్చింది.

## 2026 ఏడాదికి సెలవులు ఖరారు చేసిన తెలంగాణ ప్రభుత్వం

**27 సాధారణ సెలవులు, 26 ఐచ్ఛిక సెలవులు తెలంగాణ**

**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి**

**భోగి మొదలు క్రిస్‌మస్ మరుసటి రోజు వరకు 27 సాధారణ సెలవులు**

2026 సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాధారణ మరియు ఐచ్ఛిక సెలవుల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో మొత్తంగా 27 సాధారణ సెలవులు, 26 ఐచ్ఛిక సెలవులు ఉన్నాయని ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన సాధారణ సెలవుల్లో భోగి, సంక్రాంతి, గణతంత్ర్య దినోత్సవం, మహాశివరాత్రి, హోలి, ఉగాది, రంజాన్, శ్రీరామనవమి, గుడ్ ఫ్రైడే, బాబు జగ్జీవన్ రామ్ జయంతి, డాక్టర్ అంబేడ్కర్ జయంతి, బక్రీద్, మొహర్రం, బోనాలు, స్వాతంత్ర్య దినోత్సవం, ఈద్ మిలాద్ ఉన్ నబీ, శ్రీ కృష్ణాష్టమి, వినాయక చవితి, మహాత్మా గాంధీ జయంతి, సద్దుల బతుకమ్మ, విజయ దశమి, దీపావళి, కార్తీక పౌర్ణమి, క్రిస్‌మస్ ఉన్నాయి. రంజాన్, విజయదశమి, క్రిస్‌మస్ పండుగల మరుసటి రోజు కూడా సాధారణ సెలవుగా ప్రకటించింది.

## భారతీయులను లక్ష్యంగా చేసుకోబోమని హామీ ఇవ్వాలి: చైనాకు భారత విదేశాంగ శాఖ గట్టి సందేశం

**చైనాకు, లేదా ఆ దేశం మీదుగా రాకపోకలు సాగించే భారతీయులకు సూచనలు**

**బీజింగ్ కూడా భారత ప్రయాణికుల విషయంలో సక్రమంగా వ్యవహరించాలని సందేశం**

**ఏకపక్షంగా నిర్బంధించడం, వేధించడం చేయవద్దన్న విదేశాంగ శాఖ**



అరుణాచల్ ప్రదేశ్ అంశంపై చైనాలోని షాంఘై విమానాశ్రయంలో ఒక భారతీయ మహిళకు వేధింపులు ఎదురైన నేపథ్యంలో, చైనాకు ప్రయాణిస్తున్న లేదా ఆ దేశం మీదుగా రాకపోకలు సాగించే సమయంలో భారత పౌరులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని భారత విదేశాంగ శాఖ సూచనలు జారీ చేసింది. అదే సమయంలో బీజింగ్ కూడా భారత ప్రయాణికుల విషయంలో సక్రమంగా వ్యవహరించాలని పేర్కొంది. చైనా విమానాశ్రయాల మీదుగా రాకపోకలు సాగించే భారతీయులను లక్ష్యంగా చేసుకోబోమని చైనా హామీ ఇస్తుందని ఆశిస్తున్నామని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. ఏకపక్షంగా నిర్బంధించడం, వేధించడం వంటి పనులను మానుకుంటుందని, అలాగే అంతర్జాతీయ విమాన ప్రయాణ నిబంధనలను గౌరవిస్తుందని భావిస్తున్నామని తెలిపింది. చైనా ప్రయాణాల విషయంలో భారతీయులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

## వందేమాతరంపై పార్లమెంట్‌లో చర్చ.. అందుకేనంటూ ప్రియాంక గాంధీ ఆరోపణ



పశ్చిమ బెంగాల్‌లో వచ్చే సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందునే పార్లమెంటులో వందేమాతరం గేయంపై చర్చ చేపట్టారని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీ ఆరోపించారు. వందేమాతరం 150వ వార్షికోత్సవాల సందర్భంగా ఆ గేయంపై సభలో చర్చ జరుగుతోంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "బెంగాల్‌లో త్వరలో ఎన్నికలు ఉన్నాయి. అందుకే ప్రభుత్వం వందేమాతరంపై చర్చ కోరుకుంటోంది. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకు ఈ చర్చను చేపట్టారు" అని ఆరోపించారు. వందేమాతరం భారత ప్రజల్లో మమేకమై ఉందని, ఇది మన జాతీయ గీతమని ఆమె అన్నారు. ప్రజలు వర్తమానం, భవిష్యత్తును వదిలి గతంలోకి తొంగి చూడాలని ప్రభుత్వం కోరుకుంటోందని అన్నారు. ఈ దేశంలో ప్రజలెవరూ సంతోషంగా లేరని, వారిని ఎన్నో సమస్యలు వేధిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ప్రభుత్వం వాటిని పరిష్కరించే దిశగా చర్చ జరపడం లేదని అన్నారు. అధికార పార్టీ సభ్యులు ఎప్పుడూ నెహ్రూ గురించి మాట్లాడుతున్నారని, కాబట్టి ఒక పని చేద్దామని ప్రియాంక గాంధీ అన్నారు. అందుకోసం సమయం కేటాయించుకుందామని, నెహ్రూ గురించి మాట్లాడాలనుకున్న అంశాలన్నీ ఓ జాబితాగా తయారుచేద్దామని, వాటిపై చర్చిద్దామని సూచించారు. ఇక ఆ అధ్యాయాన్ని అక్కడితో ముగించుకుందామని వ్యాఖ్యానించారు. వందేమాతరం గురించి చర్చిస్తున్నట్లుగానే నెహ్రూ గురించి కూడా చర్చిద్దామని సూచించారు.

# విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవం




హైదరాబాద్, డిసెంబర్ 08బీ( వాయిస్ టూ డే) : భారత దేశాన్ని 2047 వరకు ఒక అవినీతి రహిత చదువుతో కూడిన ఆరోగ్య కరమైన దేశంగా తయారుచేయడమే లక్ష్యంగా విజన్ 2047 ప్రొఫెషనల్ ఫౌండేషన్ పనిచేస్తుంది అని ఫౌండర్ ప్రెసిడెంట్ డా. హరిచరణ్ అన్నారు.ఈ మేరకు ఓయూ లోని దూరవిద్య కేంద్రంలో విజన్ 2047 ప్రొఫెషనల్ ఫౌండేషన్ మొదటి వార్షికోత్సవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ తెలంగాణ చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అవినీతిరహిత ఆరోగ్యకరమైన భారతదేశంగా తయారు చేస్తామని వార్షికోత్సవానికి వచ్చిన వారితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క భారతీయుణ్ణి దేశం కోసం ఆలోచించే విధంగా అభివృద్ధిలో భాగస్వాములు అయ్యే విధంగా వారిని తయారు చేస్తామని తెలిపారు. విజన్ 2047 అనేది మామూలు సోషల్ సర్వీస్ తో కాకుండా భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా చూడాలంటే ముఖ్యంగా మూడు లక్షణాలను కలిగి ఉండాలని లంచం లేకుండా, ఎడ్యుకేషన్ అభివృద్ధి చేసి, హెల్త్ కేర్ సిస్టం పెంపొందించాలని అన్నారు. ఈ మూడింటి పైన యువకులను, విద్యార్థులను భాగస్వాములు చేసి వాటికోసం ట్రైనింగ్ సెక్షన్స్, సెమినార్లు, స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేసుకుంటూ వెళతామని తెలిపారు. సమాజ సేవలో కమ్యూనిటీ కొరకు ఎవరైతే కృషి చేశారో అలాంటి వారిని గుర్తించి వారికి లైఫ్ టైమ్ అవార్డులు ఇవ్వడం జరిగిందన్నారు.అందులో భాగంగా ఎంపీ అర్ కృష్ణయ్య, మందకృష్ణ మాదిగ,మాజీ మంత్రి అమర్ సింగ్ థిలావత్, ప్రముఖ న్యాయవాది కొండా లక్ష్మి కాంత్ రెడ్డి, సన్మానించారు. సామజికవేత్త డా.డి. రాజ్ కుమార్ జాదవ్ ను సర్వీస్ బియాండ్ స్టెతస్కోప్ అవార్డుతో సత్కరించారు.

ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. హరిచరణ్ అధ్యక్షత వహించగా ఆర్.కృష్ణయ్యతో పాటు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మెన్ ప్రో.వి. బాలకృష్ణారెడ్డి, కర్ణాటక కేంద్ర విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ప్రొ. బట్టు సత్యనారాయణ ప్రత్యేక అతిథిగా వేదికపై ఆసీనులైనారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ పేదరికం నిర్మూలనతో పాటు పౌరులకు మెరుగైన జీవన నాణ్యతను నిర్ధారించడానికి కీలకమైన సామాజిక అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి వికసిత్ భారత్- 2047 తోడ్పడుతుందన్నారు. విజన్-2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్ వికసిత్ భారత్-2047 సాధించడానికి తమ వంతు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వి. బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగమే మనకు అత్యున్నతమని, దానికి అనుగుణంగానే పారిశ్రామిక, ఆర్థిక ప్రగతి, మెరుగైన విద్య, ఆరోగ్య భారత్ కోసం విజన్-2047 ప్రణాళికలు రూపొందించి, కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డా. పుట్ట పాండు రంగయ్య, సమన్వయ కార్యదర్శి జి.విజయ హరిచరణ్, కోశాధికారి నల్లారి రాజేందర్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి మరియు డాక్టర్ శివరాజు,డాక్టర్ విశ్వనాథ్,సుధాకర్, విజయేందర్ రెడ్డి, సాయి, సూరి,అరవింద్, గోవర్ధన్ రెడ్డి,హరి, రామ్ రెడ్డి పాల్గొన్నారు.



## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 కార్యక్రమం రాష్ట్ర అభివృద్ధి దిశగా మరో చారిత్రాత్మక అడుగు

**టీపీసీసీ అధికార ప్రతినిధి,**

**నేరేడ్కో తెలంగాణ ఉపాధ్యక్షులు డా .సత్యం శ్రీరంగం**

కూకట్‌పల్లి, డిసెంబర్ 8(వాయిస్ టుడే): తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 కార్యక్రమం రాష్ట్ర అభివృద్ధి దిశగా మరో చారిత్రాత్మక అడుగుగా నిలిచింది. తెలంగాణ రైసింగ్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్లోబల్ సమ్మిట్ ప్రారంభించారు. ఈ సమ్మిట్‌కు మొత్తం 44 దేశాల నుండి 154 మంది అంతర్జాతీయ ప్రతినిధులు హాజరవడంతో తెలంగాణ గ్లోబల్ స్థాయిలో మరింత గుర్తింపు పొందుతోందని తెలిపారు. ఈ సందర్భంగా వ్యాపారవేత్త డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ఈ మహత్తర అంతర్జాతీయ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం దక్కడం నాకు గొప్ప గౌరవంగా భావిస్తున్నానని, రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు అత్యంత శ్రద్ధగా, అత్యున్నత స్థాయి ప్రమాణాలతో నిర్వహించబడటం ప్రశంసనీయమని, ఈ సమ్మిట్ తెలంగాణ భవిష్యత్ ప్రగతికి ఓ శక్తివంతమైన వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ సమ్మిట్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇన్నోవేటర్లు, పెట్టుబడిదారులు, విధాన నిర్ణేతలు మరియు వ్యాపారవేత్తలను ఒకే వేదికపైకి తీసుకువస్తోంది అన్నారు. రాష్ట్రం ప్రకటించిన “ తెలంగాణ రైజింగ్ విజన్ 2047 ” లక్ష్యాలను సాకారం చేయడానికి ఈ కార్యక్రమం కీలకమైన పాత్ర పోషించనుందని, ఈ సమ్మిట్ కు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులతో పాటు సినీ ప్రముఖులు, వివిధ సంస్థల ప్రతినిధులు, తెలంగాణ నేరేడ్కో అధ్యక్షులు మేక విజయ్ సాయి, శ్రీధర్ రెడ్డి, చలపతి రావు, డా.సత్యం శ్రీరంగం, సునీల్ చంద్రారెడ్డి, కృష్ణ రెడ్డి, మోడీ బిల్డర్ అశోక్, తెలంగాణ నేరేడ్కో ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఇందిరానగర్‌లో నిరుపేదలకు అండగా ఉంటా ..

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



కూకట్‌పల్లి, డిసెంబర్ 8(వాయిస్ టుడే) : కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలానగర్ డివిజన్ ఇందిరా నగర్ లో నూతన పైప్ లైన్ పనులు వాటర్ వర్క్స్ అధికారులు నిర్మాణం చేస్తున్న సందర్భంగా ఐడీపీఎల్ అధికారులు పనులకు ఆటంకం కలిగించిన నేపథ్యంలో వెంటనే కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆ ప్రాంతానికి వెళ్ళి ఎట్టిపరిస్థితుల్లో పనులు ఆపడానికి లేదని...ఇదంతా కూడా ఐడీపీఎస్ కు సంబంధించిన భూమి కాదని ఇప్పటికే ఇక్కడ డ్రైనేజ్...కరెంట్ లైన్లు..రోడ్లు నిర్మాణ పనులు పూర్తి అయ్యాయని తెలిపారు...ఎంతో మంది నిరుపేదలు దాదాపు 70 ఏళ్ల నుంచి ఇక్కడ నివసిస్తున్న ఈ ప్రాంతంలో పనులు ఎలా అడ్డుకుంటారని దాదాపు 4 గంటలు అక్కడే బైఠాయించి పనులు ఆపేది లేదని ..ఒకవేళ పనులు ఆపితే ఇక్కడే కూర్చుంటానని తేల్చి చెప్పడంతో పోలీస్ అధికారులు సర్దిచెప్పడంతో సంయమనం పాటించారు... ...అంతే కాకుండా అధికారులకు కాలనీ అంతా పనులు ఏ విధంగా చేశామో వివరించారు...అనంతరం వాటర్ వర్క్స్ అధికారులు పనులు కొనసాగించారు...ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ దాదాపు 70 ఏళ్ల నుంచి ఇక్కడ నివసిస్తున్న నిరుపేదలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని పెండింగ్ లో ఉన్న పనులు కూడా పూర్తి చేయాలని సంకల్పించుకున్నారని ...ఇలా ఐడీపీఎల్ అధికారులు పనులు అడ్డుకుంటే నిరుపేదలను కాపాడుకోవడానికి దైనికైన సిద్ధం అని తేల్చి చెప్పారు...ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి...స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# డిసెంబర్ 9 నుంచి ‘టీటీఏ సేవాడేస్ 2025’ ప్రారంభం

**అమెరికాలో అతిపెద్ద తెలంగాణ సంఘం ‘టీటీఏ’**

**తెలంగాణలో ‘టీటీఏ’ భారీ సేవా కార్యక్రమాలకు శ్రీకారం**

**డిసెంబర్ 25న ‘టీటీఏ’ 10వ వార్షికోత్సవం**

**డిసెంబర్ 14న గచ్చిబౌలిలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం**

**40కి పైగా సేవా కార్యక్రమాలను ప్రకటించిన ‘టీటీఏ’**

హైదరాబాద్: తెలుగు కళల తోట.. తెలంగాణ సేవల కోట.. అంటూ తెలంగాణ ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను అమెరికాలో ఘనంగా నిలబెడుతున్న ‘తెలంగాణ అమెరికా తెలుగు సంఘం’ (%టూా%) తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ స్థాయిలో “సేవాడేస్ 2025” కార్యక్రమాలను ప్రారంభిస్తోంది. ఈ %టూా% సేవాడేస్ 2025 డిసెంబర్ 9 నుంచి డిసెంబర్ 23 వరకు తెలంగాణ జిల్లాల్లో నిర్వహిస్తారు. డిసెంబర్ 14న గచ్చిబౌలిలో “10%ఖ% రన్”తో డ్రగ్స్‌పై భారీ స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారు. డిసెంబర్ 25న %టూా% 10వ వార్షికోత్సవ వేడుకలు జరుపుతారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీటీఏ నాయకులు ‘టీటీఏ సేవాడేస్ 2025’ ప్రకటించి, కార్యక్రమాల వివరాలు తెలిపారు.




TTA ఏటా నిర్వహించే ఈ సేవాడేస్‌లో భాగంగా ఆరోగ్యం, విద్య, సమాజ అభివృద్ధి, యువత అవగాహనా కార్యక్రమాలు, మాదకద్రవ్యాల నివారణపై చైతన్యం, రక్తదానం, ఆహార పంపిణీ, గిరిజన ప్రాంతాలకు మద్దతు.. వంటి 40కి పైగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తారు. TTA సేవాడేస్‌లో భాగంగా సేవ కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, వరంగల్, హన్మకొండ, భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట, జనగామ, నల్లగొండ, యాదాద్రితో పాటు మరిన్ని జిల్లాల్లో నిర్వహిస్తారు.

ఈ కార్యక్రమాలను TTA నాయకత్వ బృందం రూపొందించింది. TTA ఫౌండర్ పైల మల్లారెడ్డి, ప్రెసిడెంట్ నవీన్ మల్లిపెద్ది, ఏసీ-చైర్ విజయపాల్ రెడ్డి, ఏసీ కో చైర్ మోహన్ రెడ్డి పటలోళ్ల,సేవాడేస్ సలహాదారు డా. ద్వారకానాథ్ రెడ్డి, TTA కన్వెన్షన్ 2026 చైర్ ప్రవీణ్ చింతా, 10వ వార్షికోత్సవ చైర్ DLN రెడ్డి, జాయింట్ ట్రెజరర్ స్వాతి చెన్నూరి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ - ఇంటర్నేషనల్ సర్వీసెస్ డైరెక్టర్ జ్యోతి రెడ్డి దూదిపాల, EX BOD రమా కుమారి వనమా, అంతర్జాతీయ VP నర్సింహ పెరుక, సేవాడేస్ కోఆర్డినేటర్ విశ్వ కంది, 10వ వార్షికోత్సవ వేడుక కల్చరల్ చైర్ డా. వాణి గడ్డం.. అమెరికా నుండి %టూా% నాయకత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులు, వాలంటీర్లు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**TTA 10వ వార్షికోత్సవం**

2025 డిసెంబర్ 25న TTA తన 10వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించబోతోంది. గడిచిన దశాబ్ద కాలంలో %టూా% చేసిన సేవా కార్యక్రమాలు, సామాజిక సేవ, తెలంగాణతో ఉన్న అనుబంధం వంటి అంశాలు ఈ వేడుకలో ప్రధానంగా చోటు చేసుకుంటాయి. పదేళ్లుగా తెలంగాణతో తమ బంధం మరింత బలపడుతోందని టీటీఏ నాయకులు తెలిపారు.

**10K రన్”తో డ్రగ్స్‌పై అవగాహన**

టీటీఏ సేవాడేస్ 2025లో భాగంగా డిసెంబర్ 14న గచ్చిబౌలిలో Say No To Drugs సందేశంతో “10K రన్” నిర్వహించబోతున్నారు. ఈ ఏడాది సేవాడేస్ ప్రధాన థీమ్ Say No To Drugs అని టీటీఏ నాయకులు తెలిపారు. ఈ రన్‌లో విద్యార్థులు, యువత, స్పోర్ట్స్ కమ్యూనిటీ, వాలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. ఫిట్‌నెస్‌ను ప్రోత్స హించడంతో పాటు డ్రగ్స్ అవగాహన కోసం సమాజానికి బలమైన సందేశం ఇవ్వడం ఈ కార్యక్రమం లక్ష్యమని, యువత భవిష్యత్తును కాపాడేందుకు ఇటువంటి కార్యక్రమాలు కీలకమని TTA నాయకత్వం తెలిపింది.

2014లో అమెరికాలో స్థాపించిన TTA సంస్థ విద్య, ఆరోగ్యం, సామాజిక సేవ రంగాల్లో వేలాది మందికి సేవలు అందిస్తూ అమెరికాలో ఉన్న అతిపెద్ద తెలంగాణ సంఘాలలో ఒకటిగా నిలిచింది.

## ఘనంగా అయ్యప్ప పడిపూజ మహోత్సవం

**కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్**



కూకట్ పల్లి, డిసెంబర్ 8(వాయిస్ టుడే) : కూకట్ పల్లి నియోజకవర్గం హమూసాపేట్ సర్కిల్ పరిధిలోని శివశంకర్, నరసింహ ఆధ్వర్యంలో మూసాపేట్ లోని సోమవారం శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి 18వ మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో నిర్వహకులు రమేష్ అందించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తూము వేణు ,అశోక్, శంకర్ కొండల్ రెడ్డి ,శీను తదితరులు పాల్గొన్నారు.

## పాపిరెడ్డి నగర్ శ్రీ మినీ మేడారం సమ్మక్క - సారలమ్మ దేవస్థాన కమిటీ కొత్త అధ్యక్షుడిగా అల్లం రమేష్ యాదవ్ నియామకం



కూకట్‌పల్లి, డిసెంబర్ 8(వాయిస్ టుడే): శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పాపిరెడ్డి నగర్‌లోని శ్రీ మినీ మేడారం సమ్మక్క%-%సారలమ్మ దేవస్థాన కమిటీ కొత్త అధ్యక్షుడిగా అల్లం రమేష్ యాదవ్ ను నియమించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆకుల వెంకటస్వామి, ప్రధాన అర్చకులు ప్రకాశ్ రావు, వెంకటేశు, ప్రభాకర్ చైర్మన్, భూపాల్ రెడ్డి వైస్ చైర్మన్, రాజి రెడ్డి, పర్వతాలు యాదవ్, శ్రీహరి యాదవ్, మురళీకృష్ణ పటేల్, గోవర్ధన చారి, సాయికుమార్ పటేల్, మాజీ అధ్యక్షులు శ్రీధర్ పటేల్, బాలు యాదవ్, నర్సింగరావు పటేల్, శ్రీలత పటేల్, అజ్జు, శ్రీకాంత్ యాదవ్, రాజా మీసా, గుండ్లకొండ బాలు, కిరణ్, రాజేష్, సుధాకర్, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అల్లం రమేష్ యాదవ్ దేవస్థాన అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

## కూకట్ పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ అభివృద్ధికి కలిసి పనిచేద్దాం

**కేపీహెచ్‌బీ 5వ ఫేజ్ నూతన కార్యవర్గానికి గాదె శివ అభినందనలు...**

**బండి రమేష్ సారథ్యంలో అభివృద్ధికి హామీ...**

**త్వరలో ఇన్‌చార్జిని కలవనున్న కమిటీ సభ్యులు....**



కూకట్‌పల్లి, డిసెంబర్ 8(వాయిస్ టుడే): కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని కూకట్‌పల్లి కాంగ్రెస్ యువ నాయకుడు గాదె శివ అన్నారు. కేపీహెచ్‌బీ 5వ ఫేజ్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కొమ్మినేని వికాస్, జనరల్ సెక్రటరీ డి.వి.ఎస్ రాజు, అసోసియేషన్ సలహాదారు వి.వి రావులను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా గాదె శివ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూనే, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ సూచనలతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నూతన కార్యవర్గంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. దీనిపై స్పందించిన అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. బండి రమేష్ సహకారంతో కాలనీ సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. త్వరలోనే అసోసియేషన్ కమిటీ సభ్యులంతా బండి రమేష్‌ను కలవనున్నట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

## గాజులరామారం డివిజన్ పరిధిలో కైసర్ నగర్ సమస్యలపై పాదయాత్ర చేసిన కార్పొరేటర్ రావుల శేషగిరి



కుత్బుల్లాపూర్ డిసెంబర్ 8(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రావుల శేషగిరి గాజులరామారం డివిజన్ పరిధిలో కైసర్ నగర్ సమస్యలపై పాదయాత్ర చేసిన బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి గురు స్వామి తదితర బిజెపి నాయకులు.



## స్థలంపై డబ్బులు ఎవ్వరికీ ఇవ్వకూడదు

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

కుత్బుల్లాపూర్ డిసెంబర్ 8(వాయిస్ టుడే): బీరప్ప నగర్‌లో రహదారి వెడల్పు పేరిట మరమ్మతులు చేస్తుంటే వాటర్ లైన్ పగిలి మూడు రోజులైతున్నప్పటికీ పట్టించుకోకపోవడం వల్ల నేడు బీరప్ప నగర్ ప్రజలు నిరసనను వ్యక్తం చేయడం జరిగింది. ఈ విషయాన్ని సిపిఐ నాయకత్వం కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఇవాళ సాయంత్రం లోగా మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది ఒకవేళ పరిష్కరించకపోతే రేపు ధర్నా నిర్వహిస్తామని ప్రజలంతా కలిసి హెచ్చరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ రోడ్డు వేసే క్రమంలో కొంతమంది అవసరాల కోసం రోడ్డు అలైన్మెంట్ ను మార్చడం వల్ల ఆ దారి వెంబడి ఉన్నటువంటి ఇంటి వాళ్లకు కొంత స్థలం ముందు భాగాన ఉండటం జరుగుతున్నది దీన్ని ఆసరాగా చేసుకుని కొంత మంది ఆ ఇంటి యాజమాన్యాల దగ్గర 50 గజాల వాళ్లకు 50,000,80 గజాల వాళ్లకు లక్ష ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్టు ప్రజలు మాట్లాడుకుంటున్నారు ఈ విషయం సిపిఐ నాయకత్వానికి తెలియడం వల్ల నేడు బస్తి ప్రజలకు ఎవరు కూడా డబ్బులు ఇవ్వద్దని ఆ స్థలం ప్రభుత్వానిదేనని రానున్న రోజుల్లో ఆ స్థలంలో పాదచారుల బాట ఏర్పాటు చేపిస్తామని కాబట్టి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి హరినాథ్ రావు, మహిళా సమైక్య అధ్యక్షురాలు హైమావతి, లక్ష్మి,నాగ లక్ష్మి, భాగ్యమ్మ, సోమేశ్వరి,రవీందర్ రెడ్డి,పి ఎన్ రెడ్డి, సువర్ణ బాలాజీ,ఉమా, నర్సింహా, కళ్యాణి, సత్యమ్మ, యాదయ్య, యూసఫ్, వనజ,ప్రభాకర్ రెడ్డి లు పాల్గొన్నారు.



## అయ్యప్ప మాలధారణ... సర్వపాప హరణం

### బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 8(వాయిస్ టుడే): 125 - గాజుల రామారం డివిజన్ ఉమాదేవి నగర్ లో నిర్వహించిన అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....అయ్యప్ప మాలధారణ... సర్వపాప హరణమని, అయ్యప్ప ఆజ్ఞ లేనిదే మాలధారణ సాధ్యం కాదన్నారు. ఆ అయ్యప్ప దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, తెలంగాణ సాయి, సుంకరి చందు, సమ్మయ్య యాదవ్, బోయిని మహేష్, రాములు గౌడ్, కరుణాకర్, వాహిద్, ప్రసాద్, శ్రవణ్, శివా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్ కొలుకుల జగన్

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 8(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో కూనమాలక్ష్మి 6 లక్షల రూపాయలతో చేపట్టిన రోడ్డు పనులను సోమవారం డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగద్గిరిగుట్ట డివిజన్ ను అన్ని రంగాలలో అభివృద్ధి పరచడానికి తాను శాయశక్తుల కృషి చేస్తారని హామీ ఇచ్చారు. తాను కార్పొరేటర్గా ఎన్నికైన నాటి నుండి డివిజన్ ను అన్ని రంగాలలో ముఖ్యంగా మౌలిక వసతుల కల్పనలో రాజీ పడకుండా పనులను చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాపయ్య గౌడ్. వెంకటేష్. మహంకాళి. దుర్గయ్య. శ్రీనివాస్. శివ. Kv రాజు. మరియు బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## బ్లడ్ క్యాన్సర్‌తో ఇంటర్ విద్యార్థిని మృతి



చాంద్రాయణగుట్ట: బ్లడ్ క్యాన్సర్‌తో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇంటర్ విద్యార్థిని ఆదివారం రాత్రి మృతి చెందింది. దాతలు ఆదుకున్నా.. ఆసుపత్రిలో మెరుగైన వైద్యం లభించినా.. బాలిక ప్రాణాలు దక్కలేదు. పాతబస్తీ లాల్‌దర్వాజకు చెందిన ప్రశాంత్, సునీతల పెద్ద కుమార్తె ప్రణీత జగ్తాప్(17) స్థానికంగా ఓ కళాశాలలో ఇంటర్(ఎంఎల్‌టీ) మొదటి సంవత్సరం చదువుతోంది. గతనెల 5న శరీరంపై మచ్చలు కనిపించడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చూపించారు. వైద్యులు బ్లడ్ క్యాన్సర్ అని నిర్ధారించడంతో అదేనెల 10న బసవతారకం ఆసుపత్రిలో చేర్పించారు. ఇళ్లల్లో పనిచేసుకుని పిల్లలను పోషించుకుంటున్న ఆ కుటుంబానికి బాలిక వైద్యచికిత్స నిమిత్తం ఆర్థికసాయం అందించాలని మానవతావాదులను కోరుతూ 'ఈనాడు'లో కథనం వచ్చింది. దాతలు ముందుకొచ్చి కొంత ఆర్థిక సాయం అందించారు.అయితే అప్పటికే ఆమె ఆరోగ్యం విషమించింది. కాలేయం కింద గడ్డ ఏర్పడడం, బోన్‌మ్యారో పనిచేయకపోవడంతో తెల్లరక్తకణాలు పూర్తిగా తగ్గిపోయి 3 రోజులుగా బ్రీతింగ్ సమస్య తీవ్రమైంది. అవయవాలు పనిచేయక, శరీరం చికిత్సకు స్పందించకపోవడంతో ప్రణీత జగ్తాప్ ఆదివారం రాత్రి తుదిశ్వాస వదిలింది.

# గుట్కా-పాన్ మసాలా వాడకంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోంది

## రాజ్యసభలో ఎంపీ వద్దిరాజు ఆందోళన




హైదరాబాద్, డిసెంబర్ 08 (వాయిస్ టుడే) : రాష్ట్రాలవ్యాప్తంగా గుట్కాలు, పాన్ మసాలా, జర్దా వాడకం వల్ల ప్రజల ఆరోగ్యంలో తీవ్రమైన సమస్యలు తలెత్తుతున్నాయని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర రాజ్యసభలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం జరిగిన సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 'హెల్త్ అండ్ నేషనల్ సెక్యూరిటీస్ బిల్లు - 2025'లిలిపై మాట్లాడారు. పొగాకు ఉత్పత్తులపై పెంచుతున్న సెస్ ద్వారా వచ్చే ఆదాయంలో రాష్ట్రాలకు వాటా పంచడం ఒక శుభ పరిణామమని అభినందించారు. అదే సమయంలో పాన్ మసాలా, గుట్కా యాలకుల పొడి, మౌత్ ఫ్రెషనర్స్ పేర్లతో పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ నిర్బంధించకుండా అమ్మకాలు సాగడం తీవ్ర ఆందోళనకరమని పేర్కొన్నారు.

### అల్పాదాయ వర్గాలు అత్యంత ప్రభావితం

అల్పాదాయ కుటుంబాలు ఈ ఉత్పత్తులకు బానిసై, సరైన ఆహారం తీసుకోక అనారోగ్యానికి గురవుతున్నాయని, పిల్లల విద్య భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆయన తెలిపారు.

### 7 లక్షల బీడీ కార్మికుల భవితవ్యం ప్రశ్నార్థకం

ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో సుమారు 7 లక్షల మంది బీడీ కార్మికులు, ముఖ్యంగా మహిళలు, బడుగు%-%బలహీన వర్గాల వారు పనిచేస్తున్నారని ఎంపీ వెల్లడించారు. పొగాకు పరిశ్రమల్లో పనిచేసేవారిలో నోటి, గొంతు కేన్సర్ కేసులు భారీగా నమోదవుతుండగా, హైదరాబాద్ MNJ క్యాన్సర్ ఆసుపత్రిలో చేరేవారిలో ప్రతి 100 మందిలో 16 మంది ఇలాంటి కేన్సర్ బాధితులే అని తెలిపారు. ఈ సంఖ్య జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉందని, 2030 నాటికి పరిస్థితి మరింత ప్రమాదకర దశకు వెళ్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

### ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాలు గుర్తు

డబ్ల్యూహెచ్ఓ సూచించినట్లు పొగాకు ఉత్పత్తులపై 75% సుంకం విధించే నిబంధనలు అమలు చేయాల్సిన అవసరం తప్పనిసరిగా ఉందని అన్నారు.

డీ-అడిక్షన్ కేంద్రాలు, ఉచిత ఆరోగ్య సేవలు అవసరం

పొగాకు వ్యసనానికి గురైన వారిని మళ్లీ సాధారణ జీవితంలోకి తెచ్చేందుకు మరిన్ని డీ-అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. తరచుగా స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించాలి ఉచిత ఆరోగ్య సేవలు అందించాలి అని ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించారు. బీడీ కార్మికులకు ఉపాధి హామీ ఇవ్వాలి. సెస్ పెంపుతో బీడీ కార్మికులు నష్టపోయే అవకాశం ఉన్నందున ఒక్కొక్కరికి ?1.5 లక్షల గ్రాంట్ ఇవ్వాలి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లలో ఉద్యోగాలు ఇవ్వాలి వృత్తి నైపుణ్య శిక్షణలు అందించాలి వ్యవసాయ రంగంలో ఉన్నవారికి ఉచిత విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి అని ఎంపీ రవిచంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

### ప్రజలను కేన్సర్ బారిన పడకుండా కాపాడాలి

పొగాకు ఉత్పత్తుల హానికర ప్రభావాలపై విస్తృత ప్రచారం అవసరం ఉందని, అనారోగ్యానికి గురైన కుటుంబాలకు నేరుగా ఆర్థిక సహాయం అందించాలని సూచించారు. చివరిగా, ఈ బిల్లుకు తమ పార్టీ బీఆర్ఎస్ పూర్తిగా మద్దతు ఇస్తుందని ఎంపీ వద్దిరాజు రాజ్యసభలో ప్రకటించారు.



# గోదావరిఖని ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక

**అధ్యక్షుడిగా మాధవరావు,**

**ప్రధాన కార్యదర్శిగా గడ్డం శ్యామ్, కోశాధికారి రాజ్ కుమార్.**

**జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం కృషి చేస్తాను.**

**ఖని ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడు మాధవరావు**

గోదావరిఖని : దశాబ్దల చరిత్ర గలిగిన గోదావరిఖని ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయింది. స్థానిక ప్రెస్ క్లబ్ లో జరిగిన ఎన్నికల్లో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన జర్నలిస్టులు అంతా కూడా మూకుమ్మడిగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మాధవరావు, ప్రధాన కార్యదర్శిగా గడ్డం శ్యాం కుమార్, కోశాధికారిగా తాడబోయిన రాజ్ కుమార్, ఉపాధ్యక్షులుగా సుధాకర్ రావు, తగరపు శంకర్, జీవన్ బాబు, కేసు వాసు, సమ్మయ్య, సంయుక్త కార్యదర్శి గా బిక్షపతి, కుమారస్వామి, మామిడి అశోక్, సురభి శ్రీధర్, ఆర్గనైజ్ సెక్రెటరీ గోలి సమ్మిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా దయానంద్ గాంధీ, భాస్కర్ రాం శంకర్, సదానందం,పి.కిశోర్, శ్రీనివాస్, కోలా లక్ష్మణ్, కొండార్ రెడ్డి,జి. రవీందర్, శ్రీధర్,కె. మనోహర్ రెడ్డి, దినేష్,తిరుపతి,బొల్లం మధుబాబు, మూల శంకర్ , వరుణ్, రంగు శ్రీనివాస్,ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సీనియర్ జర్నలిస్టులు ఎల్లంకి లచ్చయ్య పాలకుర్తి విజయ్ కుమార్ మ్యాజిక్ రాజా వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు పూదరి కుమార్ గౌడ్, మాజీ ప్రధాన కార్యదర్శి పందిళ్ల శ్యాంసుందర్,సీనియర్ పాత్రికేయులు మాదాసు రామ్మూర్తి, వంశి, కోల లక్ష్మణ్, మారుతి, జక్కం సత్యనారాయణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం కృషి, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం కృషి.

పారిశ్రామిక ప్రాంతంలోని జర్నలిస్టుగా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని గోదావరిఖని ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా నియామకమైన మాధవరావు తెలిపారు. కార్యవర్గం ఎన్నిక తర్వాత ఆయన మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ ఔనత్యాన్ని మరింత పెంపొందించేందుకు పాటుపడతానని చెప్పారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతం విలేకరులకు ఇళ్ల స్థలాలు ఇప్పించడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతామని అన్నారు. ప్రధాన కార్యదర్శి ఎన్నికైన గడ్డం శ్యాం కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టుల భద్రతకు ఎలాంటి ఆటంకం కలగకుండా ముందు ఉంటామన్నారు. పాత్రికేయుల సంక్షేమమే మా ప్రధాన ఏజెండా అని చెప్పారు. పారిశ్రామిక ప్రాంతంలోని జర్నలిస్టులు అందరూ కూడా సొంత ఇండ్ల స్థలాల ఇప్పించే విషయంలో పూర్తిస్థాయి నిబద్ధతతో పని చేస్తామని పేర్కొన్నారు.

# వ్యాపారాలు, పరిశ్రమల అభివృద్ధికి ఆధునాతన వ్యూహాలు అవసరం

## ప్రముఖ వ్యాపార అభివృద్ధి వ్యూహకర్త వేణు కల్యాణ్



హైదరాబాద్, డిసెంబర్ 08: వ్యాపార రంగాలలో అభివృద్ధి సాధించేందుకు మార్కెటింగ్ విస్తరించడం, సేల్స్ పెంచుకోవడం, టీమ్ రెస్పాన్సిబిలిటీస్, క్యాష్ ఫ్లో ఇష్యూస్, ప్రాఫిటేబుల్ బిజినెస్ మోడల్, హై పర్ఫార్ టీమ్ నియమించుకోవడం తదితర అంశాలు ప్రధానమైనవని ప్రముఖ వ్యాపార అభివృద్ధి వ్యూహకర్త వేణు కల్యాణ్ అన్నారు. యునిక్ లైఫ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'వ్యాపార రంగంలో ఎలా అభివృద్ధి సాధించాలి?' అనే అంశంపై 'అల్టిమేట్ బిజినెస్ మాస్టరీ' వర్క్ షాప్ హైదరాబాద్ బేగంపేటలోని తాజ్ వివంటాలో సోమవారం జరిగింది. యునిక్ లైఫ్ ఆర్గనైజేషన్ సమన్వయకర్తలు సుశీల్ కుమార్ ఎర్రగుంట్ల, సతీష్ కుమార్ వనపర్తి, అర్చన నేతృత్వంలో జరిగిన ఈ వర్క్ షాప్ లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి సర్వీస్, ఇండస్ట్రీస్, టెక్స్టైల్, హాస్పిటాలిటీ మానేజ్మెంట్, ఎంఎస్ఎంఈ, రియల్ ఎస్టేట్, నెట్ మార్కెటింగ్, ఇన్సూరెన్స్ తదితర రంగాలకు చెందిన సుమారు 300 మంది పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులు హాజరయ్యారు. ఈ వర్క్ షాప్ ను ఉద్దేశించి వేణు కల్యాణ్ మాట్లాడుతూ వ్యాపార సందేహాలపై, వ్యాపార రంగాల్లో విజయాలు సాధించడానికి సరైన దిశానిర్దేశం చేశారు. ప్రధానంగా వ్యాపార వృద్ధి వ్యూహాలలో కొత్త మార్కెట్లలోకి విస్తరించడం (మార్కెట్ విస్తరణ), కొత్త ఉత్పత్తులు లేదా సేవలను అభివృద్ధి చేయడం (ఉత్పత్తి అభివృద్ధి), ఉన్న మార్కెట్లలో అమ్మకాలను పెంచడం (మార్కెట్ వ్యాప్తి) మరియు కొత్త మార్కెట్ల కోసం కొత్త ఉత్పత్తులను సృష్టించడం (వైవిధ్యీకరణ) తోపాటు వ్యాపార కార్యకలాపాలు, సామర్థ్యం మరియు కస్టమర్ చేరువను మెరుగుపరచడానికి కొత్త సాంకేతికతలను తెలిపుతూ, ఆర్గనైజేషన్ కల్చర్, వాల్యూస్ ఎలా క్రియేట్ చేయాలి, బిజినెస్ ఆటోపైలెట్ మోడ్ ఎలా పెట్టుకొవాలి తదితర అంశాలపై వేణు కల్యాణ్ మార్గనిర్దేశం చేశారు. ప్రతిఒక్కరికి అర్థమయ్యే విధంగా పూర్తిగా తెలుగులోనే జరిగిన ఈ వర్క్ షాప్ లో 'బిజినెస్ నెట్ వర్కింగ్' ఉపయోగాల'పై గెస్ట్ స్పీకర్ బిజినెస్ నెట్ వర్కింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనాషా, 'బిజినెస్ లీడర్ షిప్' అంశంపై ఎఫ్.టి,సి.సి.ఐ అధ్యక్షులు ఆర్. రవికుమార్ ప్రసంగించారు.





# 42% బీసీ రిజర్వేషన్ల కోసం ప్రాణత్యాగం చేసిన సాయి ఈశ్వేరాచారి కుటుంబాన్ని పరామర్శించిన పొన్నం, నిరంజన్, పుంజల వినయ్

**కుటుంబానికి ఇల్లు – ఉద్యోగం – విద్యా భద్రత హామీ**

**“త్యాగం వృథా కాకుండా చూస్తాం”**

**బీసీ మంత్రి పొన్నం**

42% బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ఆత్మత్యాగం చేసిన సాయి ఈశ్వేరాచారి మరణం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విచారం మరియు ఆగ్రహాన్ని రేకెత్తించింది. బీసీ సంఘాలు, ఉద్యమకారులు, విద్యార్థి సంఘాలు, పలు రాజకీయ పక్షాలు ఆయనను లి“బీసీల హక్కుల కోసం జీవితాన్ని అర్పించిన యోధుడు”లిగా పొగిడుతున్నాయి. సోమవారం, బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ కమిషన్ చైర్మన్ కాకర్ల నిరంజన్, కాంగ్రెస్ సీనియర్ బీసీ నాయకుడు పుంజల వినయ్ కలిసి ఈశ్వేరాచారి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబాన్ని ఓదార్చి, ప్రభుత్వం తమతోనే ఉందని వారు భరోసా ఇచ్చారు.

**పరామర్శ సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన కీలక నిర్ణయాలు:**

డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు తక్షణ మంజూరు
ఎక్స్‌గ్రేషియా ఆర్థిక సహాయం
ఈశ్వేరాచారి భార్యకు ప్రభుత్వం ఉద్యోగం
మూడు చిన్నపిల్లలకు దీర్ఘకాలిక విద్యా భరోసా పథకం

ఈశ్వేరాచారి ముగ్గురు పిల్లలూ ఎంతో చిన్నవారే కావడంతో, కుటుంబం ఎదుర్కొంటున్న పరిస్థితిని నాయకులు వివరంగా తెలుసుకున్నారు.

**“సాయి ఈశ్వేరాచారి త్యాగం వృథా కాకుండా చూస్తాం” : పొన్నం ప్రభాకర్**

పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. “సాయి ఈశ్వేరాచారి బీసీల కోసం చేసిన త్యాగం చరిత్రలో నిలిచిపోతుంది. ఆయన పోరాటం కొనసాగడానికి ప్రభుత్వం పూర్తి స్థాయి కట్టుబాటుతో పని చేస్తోంది. 42% రిజర్వేషన్ల అంశంపై త్వరలో నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటాం.” అని తెలిపారు.

**“42% రిజర్వేషన్లకు శాస్త్రీయ ఆధారాలతో నివేదిక సిద్ధం” : నిరంజన్**

బీసీ కమిషన్ చైర్మన్ కాకర్ల నిరంజన్ అన్నారు. “సామాజిక, ఆర్థిక, రాజ్యాంగపరమైన ఆధారాలతో కూడిన సమగ్ర నివేదికను సిద్ధం చేస్తున్నాం. 42% బీసీ రిజర్వేషన్ల అమలు సాధ్యమయ్యే అన్ని మార్గాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది.” అని వెల్లడించారు.

**“ చిన్న పిల్లలను అనాథలు చేసే నిర్ణయం బాధాకరం” : పుంజల వినయ్**

కాంగ్రెస్ సీనియర్ బీసీ నాయకుడు పుంజల వినయ్ మాట్లాడుతూ.. “సాయి ఈశ్వేరాచారి నిర్ణయం అత్యంత బాధాకరం. ముగ్గురు చిన్నపిల్లల భవిష్యత్తు గురించి ఒక క్షణం ఆలోచించి ఉండాల్సింది. అయితే, ఇప్పుడు ప్రభుత్వం పూర్తిగా అండగా నిలిచి పిల్లల జీవితానికి భరోసా కల్పించింది ” అని అన్నారు.



## విద్యార్థుల్లో మానసిక వికాసాన్ని పెంపొందించేందుకు కృషిచేయాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

హనుమకొండ, వాయిస్ టుడే: జిల్లాలో ప్రభుత్వ,గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో మానసిక వికాసాన్ని పెంపొందించేందుకు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్టూడెంట్ వెల్ నెస్ కార్యక్రమం పై వివిధ శాఖల అధికారులు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమన్వయ సమావేశం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విద్యార్థుల్లో మానసిక వికాసం,ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే అంశాలను గురించి చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులలో మానసిక స్థైర్యాన్ని,ఆహారశైలి,అలవాట్లు,సురక్షిత వాతావరణం కల్పించాలని విద్యా సంస్థల్లో విద్యార్థుల మానసిక వికాసం పెంపొందించేందుకు నిపుణులతో ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించే అంశాలను తెలియజేసేలా మెడికల్ ఆఫీసర్స్,పాఠశాలలు,గురుకులాల విద్యాలయాల నుండి ఒక్కో ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల మానసిక మానసిక స్థితిని నాలుగు కేటగిరీల వారిగా రెడ్,ఆరెంజ్,ఎల్లో,గ్రీన్ గా గుర్తించి సమస్యాత్మక జోన్ లో ఉన్న పిల్లలకు సైకియాట్రిస్ట్,సైకాలజిస్ట్ లతో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే విధంగా కౌన్సిలింగ్ నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య,జిల్లా సంక్షేమ అధికారి జయంతి,జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి గోపాల్,డిటిడివో ప్రేమకళ,సాంఘిక సంక్షేమ శాఖ డిడి నిర్మల,జిల్లా మైనార్టీ సంక్షేమఅధికారి గౌస్ హైదర్,చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్.ప్రవీణ్ కుమార్,గురుకుల విద్యాలయాల డిసిఓలు ఉమా మహేశ్వరి,ప్రసాద్,సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్,ఆర్బీఓ రాజ్ కుమార్,ఏఎంవో సుదర్శన్ రెడ్డి,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్,ఇతర అధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎలివేటెడ్ షెడ్ల వల్ల జీవాల్లో అంటురోగాలు నివారించవచ్చు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే డిసెంబర్ 8: ఎలివేటెడ్ షెడ్ల వల్ల జీవాల్లో అంటురోగాలు నివారించవచ్చు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు.మద్దుకూరు గ్రామం లో రైతు తలారి రవి ఏర్పాటు చేసిన ఎలివేటెడ్ మేకలు/గొర్రెల పెంపక షెడ్‌ను పరిశీలించారు సోమవారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎలివేటెడ్ షెడ్ విధానం పశుసంవర్ధక రంగంలో ఆధునిక, శాస్త్రీయ పద్ధతి అని, ఈ విధానం ద్వారా జీవుల్లో అంటు వ్యాధులు గణనీయంగా తగ్గుతాయని అన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లల మరణాల శాతం ఈ విధానంతో స్పష్టంగా తగ్గడం శుభపరిణామమని అన్నారు. ఎలివేటెడ్ ఫ్లోరింగ్ కారణంగా పేడ, మూత్రం నేలపై నేరుగా పడిపోవడం వల్ల ఫ్లోర్ ఎప్పటికప్పుడు పొడి, పరిశుభ్రంగా ఉంటుంది. దీని వలన తడి లేకుండా శుభ్రమైన వాతావరణం ఏర్పడి, జీవుల్లో అంటు వ్యాధులు ప్రబలే అవకాశాలు తగ్గుతాయి అని తెలిపారు. పరిశుభ్రత పెరగడం వల్ల జీవాలు ఆరోగ్యంగా పెరిగి, పెరుగుదల శాతం కూడా గణనీయంగా మెరుగవుతుందని చెప్పారు. అలాగే రైతు తలారి రవి స్వయంగా రూపొందించిన గడ్డి కోసే యంత్రం, ఫర్నిచర్ యూనిట్, ఫీడ్ మిక్చర్ వంటి వినూత్న ఆవిష్కరణలను కలెక్టర్ పరిశీలించి అభినందించారు. గ్రామీణ స్థాయిలో రైతులు ఇలాంటి సృజనాత్మకతను ప్రదర్శించడం పశుసంవర్ధక రంగ అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఎలివేటెడ్ షెడ్ నిర్మాణ వివరాలను కూడా కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. భూమికి 4%–%6 అడుగుల ఎత్తులో ఫ్లోర్‌ను ఎత్తుగా ఏర్పాటు చేసి, సుమారు 20%–%25 మేకలు/గొర్రెల కోసం 21 అడుగుల పొడవు, 14 అడుగుల వెడల్పు, 12 అడుగుల ఎత్తుతో షెడ్‌ను నిర్మించవచ్చని సూచించారు. సరైన గాలి ప్రసరణ, వెలుతురు పొడి వాతావరణం ఉండేలా ఈ షెడ్‌లను డిజైన్ చేయడం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్య & పశుసంవర్ధక శాఖ అధికారి డా. వెంకటేశ్వర్లు, మండల పశుసంవర్ధక అధికారి డాక్టర్ ఎం వి సంతోష్, రెవెన్యూ అధికారి సంధ్యారాణి, రైతు తలారి రవి స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ప్రజలపై ప్రేమ ఉన్న నాయకుడు కేసీఆర్

**మానవత్వ కోణంలో ఆలోచించే కేసీఆర్ కంటి వెలుగు పథకం**

**కేసీఆర్‌పై పగతో కాంగ్రెస్ కంటి వెలుగు పథకాన్ని ఆపింది**

**సంక్షేమ అభివృద్ధి యుగం కేసీఆర్ పదేండ్ల పాలన**

**ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**



హనుమకొండ, వాయిస్ టుడే: తెలంగాణ రాష్ట్ర ప్రజలపై ప్రేమ ఉన్న నాయకుడు బీఆర్ఎస్ పార్టీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని మాజీ ప్రభుత్వ ఛీఫ్ విప్,బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. కేసీఆర్ దీక్షా దివస్ 11 రోజుల కార్యక్రమాల్లో భాగంగా సోమవారం బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో డాక్టర్ అగర్వాల్స్ సహకారంతో కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమం కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మహిళలకు,పార్టీ శ్రేణులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లడుతూ మానవత్వ కోణంలో ఆలోచించే కేసీఆర్ కంటి వెలుగు పథకం అని అన్నారు. కేసీఆర్ దీక్ష ప్రాముఖ్యతను నేటి తరానికి,యువతకు తెలిపేందుకు దీక్షా దివస్ పేరిట 11 రోజుల కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని పేర్కొన్నారు. కేసీఆర్ 14 ఏండ్ల పోరాటంతోనే 60 ఏండ్ల స్వరాష్ట్ర కల సాకారం అయ్యిందని..10 ఏండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. కేసీఆర్ పై పగతో కాంగ్రెస్ కంటి వెలుగు పథకాన్ని ఆపిందని.. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని,అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందని..కూల్చివేతలు,ఎగవేతలు,మాట తప్పడాలు తప్ప తెలంగాణ ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. 420 హామీలు,6 గ్యారంటీల అమలు మరిచి కాంగ్రెస్ డై వర్షన్ పాలిటిక్స్ చేస్తోందని మటడిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటునకు అడుగుపడిన డిసెంబర్ 9, 2009 సందర్భాన్ని పురస్కరించుకొని విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మంగళవారం విజయ్ దివస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ హాజరవుతారని వినయ్ భాస్కర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, కార్పొరేటర్ సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్లు కుసుమ లక్ష్మీ నారాయణ, జోరిక రమేష్, నాయకులు పులి రజినీకాంత్, నరెడ్ల శ్రీధర్, నార్లగిరి రమేష్, నయీమొద్దీన్, సదాంత్, పానుగంటి శ్రీధర్, సల్వాజి రవీందర్ రావు, దువ్వ కనక రాజు, బుద్దె వెంకన్న, కొండపాక రఘు, తక్కళ్లపల్లి వినీల్ రావు, కోంద్ర శంకర్, సంజీవ్, శ్రీధర్ రెడ్డి, బచ్చు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**తొర్రూరు డీఎస్పీ కృష్ణకిషోర్**



తొర్రూరు, డిసెంబర్ 8 వాయిస్ టుడే : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోటీలో ఉన్న అభ్యర్థులు నిబంధనలు పాటించాలని , లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో డివిజన్ కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవన్ లో సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, పోటీలో ఉన్న సర్పంచ్ అభ్యర్థులతో సమావేశం నిర్వ హించారు.

ఈ సందర్భంగా డి.ఎస్.పి మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జర గాలని, ప్రతీ ఒక్కరు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామాల్లో గొడవలు, గుంపులు, తగాదాలు, ఉద్రిక్తతలకు దారితీస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియాలో పుకార్లు, నిర్ధారణలేని వార్తలు ప్రచారం చేయవద్ద న్నారు. ప్రతీ ఒక్కరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అన్ని పార్టీల నాయకులు పోలీసుశాఖకు సహకరించాలని కోరారు. మత విద్వేషాలు రెచ్చగొడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ గడీల శ్రీనివాస్, సీఐ గణేష్ ఎస్సై ఉపేందర్, సర్పంచు అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## పిఎంఎవై పోర్టల్ లో లబ్ధిదారుల వివరాలు నిర్దేశిత గడువులోగా నమోదు చేయాలి

**జిల్లా కలెక్టర్ డా.సత్య శారద**

**–పైడిపల్లి , దేశాయిపేట, తిమ్మాపూర్, దూప కుంట ప్రాంతాల్లో రెండు పడక గదుల ఇళ్ల పరిశీలన.**

వరంగల్ ( వాయిస్ టుడే ) డిసెంబర్ 08 : పిఎంఎవై పోర్టల్ లో లబ్ధిదారుల వివరాలు నిర్దేశిత గడువులోగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ లోని పైడిపల్లి, దేశాయిపేట, తిమ్మాపూర్, దూపకుంట ప్రాంతాల్లో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలను బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, సంబంధిత విభాగాల అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ పి ఎం ఆవాస్ యోజన (పి ఎం ఏ వై ) పథకం లో భాగం గా ఆన్ లైన్ పోర్టల్ లో ఇందిరమ్మ ఇళ్ల కు సంబంధించిన లబ్ధిదారుల వివరాలను నిర్దేశిత గడువులోగా నమోదు చేయాలని సూచించారు. ఇందుకోసం సంబంధిత విభాగాల అధికారులు సూచించిన పారామీటర్ ల ప్రకారం పూర్తి చేయాలని రెండు పడక గదుల ఇళ్ల లో శుభ్రత తో పాటు నీటి సరఫరా, ఎలక్ట్రిసిటీ, వంటి మౌలిక ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో బల్దియా సి ఎం.హెచ్ ఓ డా.రాజారెడ్డి ఆర్%డ% బి ఈఈ రాజేందర్, ఎన్ పి డి సి ఎల్ ఎస్ ఈ మధుసూదన్, ఆర్ డి ఓ సుమా, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి ఈ ఈ లు సంతోష్ బాబు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్

**కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ బలపరిచిన వార్డు సభ్యులు**

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే డిసెంబర్ 8: స్థానిక ఎన్నికల నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీలో చేరికలు ఊపందుకున్నాయి. భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండలం రామాంజనేయకాలనీ బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన వార్డు సభ్యులు పోకల శ్రీలత, దారావత్ మంజు, దారావత్ నాగ ప్రతాప్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి డీసీసీ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, కాంగ్రెస్ నాయకులు జెవిఎస్ చౌదరి, ఆళ్ల మురళి, ఊకంటి గోపాల్ రావు, జేబి శౌరి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, సుజాతనగర్ మండల అధ్యక్షులు చింతలపూడి రాజశేఖర్, గౌస్ మొయినుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



## కేంద్రీయ విద్యాలయం కాంపిటీషన్ పోటీలు

**కేంద్ర విద్యాలయం ప్రిన్సిపల్ మహేష్**

ఝరాసంగం సంగారెడ్డి జిల్లా డిసెంబర్ 8 (వాయి టుడే) : ఝరాసంగం మండల కేంద్రమైన మాచునూర్ గ్రామంలో కేంద్రియ విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల కాంపిటీషన్ పోటీలు విద్యార్థులు పాల్గొన్న ఉత్సాహంగా కార్యక్రమంలో విద్యార్థులు వివిధ క్రీడలలో పాల్గొంటూ ప్రదర్శించారు. పాఠశాల కేంద్ర విద్యాలయం ప్రిన్సిపల్. మహేష్ మాట్లాడుతు క్రీడలు విద్యార్థుల్లో శారీరక సమర్థతతో పాటు టీమ్ స్పిరిట్, కేంద్రీయ విద్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి

**మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తోనే రాష్ట్ర అభివృద్ధి**

**కెసిఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయం**

**స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి**

**నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశా**

**మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్చార్జ్ వనమా**



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే డిసెంబర్ 8 : బిఆర్ఎస్ పార్టీ హయాంలోనే గ్రామీణ ప్రాంతాలు ఎంతగానో అభివృద్ధి చెందాయని స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్చార్జి వనమా వెంకటేశ్వర పిలుపునిచ్చారు. సోమవారం చంటిపల్లి మండల పరిధిలోని నంద తండా అభ్యర్థి మాలోత్ బలరాం నాయక్ , చింతపల్లి తండా మాలోతు రాజా గ్రామపంచాయతీలో పోటీ చేస్తున్న అభ్యర్థుల విజయం కోసం ఆయన విస్తృతంగా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి వనమా, వనమా రాఘవేంద్రరావు లకు ఆయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. డప్పు మేళాలతో, డాన్సులు వేస్తూ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామాల పొలిమేరల నుంచి మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావును, పార్టీ నాయకులను మేళ్ల తాళాలతో స్వాగతం పలుకుతూ గ్రామాల్లో మీది వీధిన ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ హయాంలోనే గ్రామీణ ప్రాంతాలు ఎంతగానో అభివృద్ధి చెందాయన్నారు. రాబోయే ఎన్నికల్లో కల్వకుంట్ల చంద్రశేఖర రావును తిరిగి ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆశీర్వాదాలు తోనే తాను గ్రామపంచాయతీ సర్పంచ్ నుంచి మున్సిపల్ చైర్మన్ గా, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచానని అలాగే రాష్ట్ర మంత్రిగా పనిచేశానని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కొత్తగూడెం నియోజకవర్గంలో తన హయాంలో ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. పట్టణంలోని ఏ బస్తీని, పల్లెల్లో ఏ వీధిని అడిగిన అభివృద్ధి విషయంలో తన పేరే చెబుతాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి బిఆర్ఎస్ పార్టీ గెలుపుతోనే సాధ్యపడుతుందని పేర్కొన్నారు. ఈ పార్టీ నుంచి ఎన్నికల బరిలో దిగిన సర్పంచ్, వార్డ్ మెంబర్ల అభ్యర్థులు నిస్వార్థంగా పనిచేసేందుకు ముందుకు వచ్చారని, అలాంటి వారిని ఎన్నికల బరిలో నిలిపామని పేర్కొన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి వనమా జీబ్ లో నిలుచుని ప్రజలకు అభివాదం చేస్తూ బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వనమా రాఘవేంద్రరావు ప్రజలతో కలిసి డప్పు మేళాలతో నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, నాయకులు బట్టు మంజుల, నవతన్ పాల్గొన్నారు.



## ఉత్పాదకత-భద్రత పెంపుకు టిపిఎం విధానాన్ని ఐటీసీ ప్లాంట్‌లో పరిశీలించిన కలెక్టర్ జితేష్ వి. పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే డిసెంబర్ 8 : సోమవారం ఐటీసీ పిఎస్పీడీ భద్రాచలం యూనిట్‌ను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. ఈ సందర్శనలో యూనిట్ హెడ్ శైలేందర్ కుమార్ సింగ్, పేపర్ %ు% బోర్డ్ హెడ్ రాంబాబు, హ్యూమన్ రిసోర్సెస్ హెడ్ పి. శ్యామ్ కిరణ్, అడ్మిన్ హెడ్ చెంగల్ రావు తదితర సీనియర్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు. యూనిట్ మేనేజ్‌మెంట్, ప్లాంట్‌లో అమలు చేస్తున్న ఆధునిక భద్రతా ప్రమాణాలు, ఎనర్జీ ఎఫిషియెన్సీ చర్యలు, అలాగే యంత్రాంగ పనితీరును మెరుగుపరచడంతోపాటు బ్రేక్‌డౌన్‌లను తగ్గించేందుకు చేపట్టిన టిపిఎం (టోటల్ ప్రొడక్టివ్ మెయింటెనెన్స్) విధానం గురించి కలెక్టర్‌కు విపులంగా వివరించారు. ప్రాసెస్ కంట్రోల్ వ్యవస్థలు ఉత్పత్తి ప్రతి దశలో ఎలా ఖచ్చితత్వం, నాణ్యత, ఆపరేషనల్ నమ్మకాన్ని నిర్ధారిస్తున్నాయో మేనేజ్‌మెంట్ ప్రెజెంటేషన్ రూపంలో తెలియజేసింది. పేపర్ బోర్డు తయారీ ప్రక్రియలో వినియోగిస్తున్న ఆధునిక యంత్రాంగం, ఆటోమేషన్ టెక్నాలజీ, పర్యావరణ హిత తయారీ విధానాలను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్శన ద్వారా ఐటీసీ పిఎస్పిడి యూనిట్‌లో భద్రత, టిపిఎంఆధారిత సామర్థ్యవృద్ధి, పర్యావరణానుకూల ఉత్పత్తి విధానాలపై ఉన్న నిబద్ధతను జిల్లా పరిపాలన మరింత సమగ్రంగా అవగాహన చేసుకుంది. ప్లాంట్ కార్యకలాపాలలో నాణ్యత, భద్రత, పారిశ్రామిక ప్రమాణాల అమలుపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.



## చిగురుమామిడి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ఆకవరం భవాని శివప్రసాద్

**సర్పంచ్‌గా గెలిపిస్తే ఆదర్శవంత గ్రామంగా తీర్చిదిద్దుతా**

**సమస్యలను తీర్చేందుకు పూర్తి హామీ**

హుస్నాబాద్, (వాయిస్ టుడే ప్రతినిధి ) డిసెంబర్ 8 : కరీంనగర్ జిల్లా చిగురుమామి మండలం చిగురుమామిడి సర్పంచ్ గా ఆకవరం భవాని శివ ప్రసాద్ పోటీచేస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్ సహకారంతొ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సర్పంచ్ గా ఆకవరం భవాని శివ ప్రసాద్ బరిలో నిలుచున్నారు. భవాని మాట్లాడుతూ చిగురుమామిడి గ్రామం సమస్యల వలయంగా మారిపోయిందని తనను సర్పంచ్ గా గెలిపిస్తే చిగురుమామిడి గ్రామాన్ని ఏ సమస్య లేకుండా తీర్చిదిద్దుతానని అంతేకాకుండా చాలా సంవత్సరాల నుంచి ఉన్న సమస్యలు సంవత్సరంలోపు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అత్యధిక నిధులు తీసుకువచ్చి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. మరియు గ్రామంలో పారిశుధ్య సమస్యలు అధికంగా ఉన్నాయని వాటిని అధిగమించేందుకు అధిక నిధులు కేటాయించి సమస్యను పరిష్కరిస్తానన్నారు. కోతుల బెడద లేకుండా చేస్తానని ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తానని అన్నారు. బతుకమ్మ కుంటను అభిరుచి చేస్తానని సీసీ రోడ్లని నిర్మాణం సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేస్తానన్నారు. బస్టాండ్ ప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తానని యువతకు నిరుద్యోగ యువతకు వివిధ కంపెనీల ద్వారా ఉద్యోగ కల్పన చూపిస్తానన్నారు. అర్హులైన వారికి వికలాంగుల, వృద్యాప్త, వితంతువు పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇండ్లు ఇప్పిస్తానన్నారు. అభివృద్ధి పథంలో తీసుకపోవడానికి నా వంతు ప్రయత్నం చేస్తానని ప్రజలు ఏ సమయంలోనైనా నా తలుపు తడితే వారికి అందుబాటులను ఉంటారని తెలియజేశారు. పోటీచేస్తున్న వార్డు సభ్యుల శ్రీకాంత్, పోతారవేణి అనిల్, క్రాంతి, బొల్లి శ్రీలత, లావణ్య, పెనుగుల శ్రీనివాస్, రజిత, తాళ్లపెల్లి ఆరవింద్, బెజ్జంకి భాగ్యలక్ష్మి, మల్లం కుమారస్వామి, విజయలక్ష్మి లు ఉన్నారన్నారు.



## మిషన్ భగీరథ లీకేజీ మరమ్మత్తులపై సోయి లేని అధికారులు

మహబూబ్నగర్ జిల్లా, డిసెంబర్ 8 (వాయిస్ టుడే) : (జడ్చర్ల )రాజాపూర్ మండలం పరిధిలో ఉన్న గ్రామంలో చొక్కంపేట్ గ్రామంలో బొడ్రాయి డబల్ బెడ్ రూమ్ ఆవరణంలో దగ్గర మిషన్ భగీరథ పైపు పగిలి ఆరు నెలలు గడుస్తున్న మిషన్ భగీరథ యజమానులు పట్టించుకోవడం లేదు అని గ్రామస్తులు యాదయ్య మాట్లాడారు వాయిస్ టుడే పత్రికకు తెలిపారు . యాదయ్య తెలిపిన వివరాల మేరకు ఆరు నెలలు గడుస్తున్నా భగీరథ వాటర్ పై పగిలి మరమ్మతులు చేయాలని ఎన్నోసార్లు ఫోన్లు చేసి కూడా చెప్పడం జరిగింది మిషన్ భగీరథ సంబంధిత అధికారులు ఎవరు పట్టించుకోవడంలేదని గ్రామంలో ప్రజలు కూడా మంచినీరు సరిగా లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని గ్రామంలోని సమస్యలు పట్టించుకునే నాధుడు లేడని మరి యాదయ్య ఈ సందర్భంగా తెలిపారు ఏమైనా స్పందించి పైపుల లీకేజీలను పరమతులు చేయాలని సందర్భంగా తెలిపారు.



## చిగురుమామిడి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా గీకురు వర్షిని రవీందర్

**సర్పంచ్ గా గెలిపిస్తే ఆదర్శవంత గ్రామంగా తీర్చిదిద్దుతా**

**సమస్యలను తీర్చేందుకు పూర్తి హామీ**

హుస్నాబాద్, (వాయిస్ టుడే ప్రతినిధి) డిసెంబర్8 : కరీంనగర్ జిల్లా చిగురుమామి మండలం చిగురుమామిడి సర్పంచ్ గా గీకురు వర్షిని రవీందర్ పోటీచేస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ఆశీస్సులతో కాంగ్రెస్ పార్టీఆధ్వర్యంలో సర్పంచ్ గా గీకురు వర్షిని రవీందర్ బరిలో నిలుచున్నారు. గీకురు వర్షిని మాట్లాడుతూ చిగురుమామిడి గ్రామంలో చాలా సమస్యలు ఉన్నాయని తనను సర్పంచ్ గా గెలిపిస్తే చిగురుమామిడి గ్రామాన్ని ఏ సమస్య లేకుండా తీర్చిదిద్దుతానని అంతేకాకుండా చాలా సంవత్సరాల నుంచి ఉన్న సమస్యలు సంవత్సరంలోపు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అత్యధిక నిధులు తీసుకువచ్చి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. మరియు గ్రామంలో పారిశుధ్య సమస్యలు అధికంగా ఉన్నాయని వాటిని అధిగమించేందుకు అధిక నిధులు కేటాయించి సమస్యను పరిష్కరిస్తానన్నారు. కోతుల బెడద లేకుండా చేస్తానని ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తానని అన్నారు. బతుకమ్మ కుంటను అభిరుచి చేస్తానని సీసీ రోడ్లని నిర్మాణం సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేస్తానన్నారు. బస్టాండ్ ప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తానని యువతకు నిరుద్యోగ యువతకు వివిధ కంపెనీల ద్వారా ఉద్యోగ కల్పన చూపిస్తానన్నారు. అర్హులైన వారికి వికలాంగుల, వృద్యాప్త, వితంతువు పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇండ్లు ఇప్పిస్తానన్నారు. అభివృద్ధి పథంలో తీసుకపోవడానికి నా వంతు ప్రయత్నం చేస్తానని ప్రజలు ఏ సమయంలోనైనా నా తలుపు తడితే వారికి అందుబాటులను ఉంటారని తెలియజేశారు. సర్పంచ్ అభ్యర్థి వర్షిని మాట్లాడుతూ తన తండ్రి ఈ ప్రాంతానికి ఈ గ్రామానికి అనేక సేవలందించారని సర్పంచిగా జెడ్పిటిసిగా ప్రజల బాగోగుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని తనను సర్పంచ్ గా గెలిపిస్తే తను తండ్రి వారసత్వాన్ని కాపాడుతానని గ్రామాన్ని మంచి అభివృద్ధి గ్రామంగా మంత్రి పొన్న ప్రభాకర్ సహకారంతో నిలబెడతారని తెలియజేశారు.

## నవాబ్ పేట గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా గూళ్లరజిత రాజు

**సర్పంచ్ గా గెలిపిస్తే ఆదర్శవంత గ్రామంగా తీర్చిదిద్దుతా**

**సమస్యలను తీర్చేందుకు పూర్తి హామీ**



హుస్నాబాద్, (వాయిస్ టుడే ప్రతినిధి ) డిసెంబర్8 : కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం చిగురు మామిడి మండలం నవాబుపేట సర్పంచ్ గా గూళ్ల రజిత రాజుపోటీచేస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ఆశీస్సులతో కాంగ్రెస్ పార్టీఆధ్వర్యంలో సర్పంచ్ గా గుళ్ళ రజిత రాజుబరిలో నిలుచున్నారు. రజిత రాజు మాట్లాడుతూ నవాబ్ పేట గ్రామంలో చాలా సమస్యలు ఉన్నాయని తనను సర్పంచ్ గా గెలిపిస్తే నవాబుపేట గ్రామాన్ని ఏ సమస్య లేకుండా తీర్చిదిద్దుతానని అంతేకాకుండా చాలా సంవత్సరాల నుంచి ఉన్న సమస్యలు సంవత్సరంలోపు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అత్యధిక నిధులు తీసుకువచ్చి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. మరియు గ్రామంలో పారిశుధ్య సమస్యలు అధికంగా ఉన్నాయని వాటిని అధిగమించేందుకు అధిక నిధులు కేటాయించి సమస్యను పరిష్కరిస్తానన్నారు. కోతుల బెడద లేకుండా చేస్తానని ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తానని అన్నారు. బతుకమ్మ కుంటను అభిరుచి చేస్తానని సీసీ రోడ్లని నిర్మాణం సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేస్తానన్నారు. బస్టాండ్ ప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తానని యువతకు నిరుద్యోగ యువతకు వివిధ కంపెనీల ద్వారా ఉద్యోగ కల్పన చూపిస్తానన్నారు. అర్హులైన వారికి వికలాంగుల, వృద్యాప్త, వితంతువు పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇండ్లు ఇప్పిస్తానన్నారు. అభివృద్ధి పథంలో తీసుకపోవడానికి నా వంతు ప్రయత్నం చేస్తానని ప్రజలు ఏ సమయంలోనైనా నా తలుపు తడితే వారికి అందుబాటులను ఉంటారని తెలియజేశారు.

# గ్రామపంచాయతీ ఎన్నికల్లో శాంతి భద్రత జరుపుకోవాలి

**జిల్లా ఎస్పీ డి జానకి**

మహబూబ్ నగర్ జిల్లా డిసెంబర్ 8 (వాయిస్ టుడే): పాలమూరు /ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రజలు, అభ్యర్థులు, కార్యకర్తలు తప్పనిసరిగా పాటించాల్సిన సూచనలు. ఎన్నికలు ప్రజాస్వామ్య పండుగ. గ్రామంలో శాంతి- భద్రతలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ నియమాలు పాటించాలని జిల్లాలోని ప్రతి ఓటరు ప్రజలకు సూచనలు

1. ఎన్నికలు శాంతియుతంగా జరగాలి. ఎవ్వరూ గొడవలకు పాల్పడరాదు.
2. ఓటు కొనడం%-%అమ్మడం చట్టపరంగా పెద్ద నేరం. ఎక్కడైనా ఇటువంటి ప్రయత్నాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలి.
3. రాత్రివేళ గుంపులుగా తిరగడం,మద్యం సేవించి గొడవలు చేయడం పూర్తిగా నిషేధం.
4. బెదిరింపులు, బలవంతపు చర్యలు ఎవరూ చేయరాదు. జరిగితే వెంటనే ఫిర్యాదు చేయాలి.
5. సోషల్ మీడియాలో పుకార్లు, రెచ్చగొట్టే పోస్టులు, తప్పుడు వార్తలు%-%వీడియోలు పంచితే చట్టరీత్యా చర్యలు తప్పవు.
6. పోలీసులు చేసే పహారా మీ భద్రత కోసం. ఎటువంటి సమస్య వచ్చినా వెంటనే 100 లేదా జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్.

8712659360 కు సమాచారం ఇవ్వాలి.

7. యువత శాంతి%-%భద్రత పరిరక్షణలో ముందుండాలి. ప్రలోభాలు, రెచ్చగొట్టే సందేశాలు చూసి ఆవేశానికి లోనుకాకండి.



8. కూడళ్ల వద్ద గుంపులుగా నిలబడడం, గొడవలకు దిగడం నేరం. కేసులు అయితే భవిష్యత్తులో ఉద్యోగాలు, పాస్‌పోర్ట్, విదేశీ అవకాశాలపై ప్రభావం ఉంటుంది.
9. ఎన్నికల నందు కేసులు అయితే బైండ్ ఓవర్ చేసి బాండ్ షరతులు ఉంటాయి, భవిష్యత్తులో చిన్నగొడవ జరిగినా పెద్ద కేసుగా మారే అవకాశం ఉంటుంది %-% జాగ్రత్తగా ఉండాలి.

అభ్యర్థులు ప్రచార కార్యకర్తల కోసం సూచనలులి

13. ఎన్నికల ప్రచారం, సమావేశాలు, ర్యాలీలు అనుమతుల్లో పేర్కొన్న పరిమితులలో మాత్రమే చేయాలి.
14. కులం, మతం, వర్గాల ఆధారంగా ప్రచారం చేయడం, ద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం నిషేధం.
15. రాత్రి అర్ధరాత్రి తర్వాత సౌండ్‌తో ప్రచారం చేయరాదు. మీటింగ్‌లకు ముందుగా అనుమతి తప్పనిసరి.
16. ఓటర్లకు డబ్బు, మద్యం, బహుమతులు ఇవ్వడం పెద్ద నేరం %-% అభ్యర్థిత్వం రద్దు అయ్యే అవకాశం ఉంటుంది.
17. ప్రచార వాహనాలు, సౌండ్ బాక్స్‌లను అనుమతులకు అనుగుణంగా తనిఖీకి సిద్ధంగా ఉంచాలి.
18. ప్రత్యర్థులను రెచ్చగొట్టే చర్యలు పూర్తిగా నిషేధం.
19. ఇళ్లకు వెళ్లి ఓటర్లను బెదిరించడం, ఒత్తిడి చేయడం, మానసిక ఒత్తిడి పెట్టడం చట్టపరంగా నేరం.
20. పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులు ఏర్పరచి వాతావరణాన్ని దెబ్బతీయరాదు.
21. ఓటర్లను తరలించడం, నియంత్రించడం, వారి ఓటు స్వేచ్ఛపై ప్రభావం చూపడం నేరం.
22. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే అభ్యర్థులపై విచారణ, కేసులు, అభ్యర్థిత్వ రద్దు వంటి చర్యలు జరుగుతాయి.
23. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం, రెచ్చగొట్టే వీడియోలు పెడితే ఐటీ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటారు.

**అత్యవసర సూచన నగదు రవాణా**

ఎవరైనా 50,000 రూపాయలకు మించి నగదు తీసుకెళుతున్నప్పుడు తప్పనిసరిగా ఆ నగదుకు సంబంధించిన ఆధారాలు వెంట పెట్టుక్కోలి. లేకపోతే ఎన్నికల నియమావళి ప్రకారం పోలీసులు ఆ నగదును సీజ్ చేస్తారు. ఎన్నికలు ప్రజల కోసం శాంతిని కాపాడండి, నిబంధనలు పాటించండి, తప్పు చేసిన వారిని భయపడకుండా పోలీసులకు తెలియజేయండి. ఎస్పీ తెలిపారు.



## అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదు

**ప్రజాక్షేత్రంలో పోటీ చేసే హక్కు రాజ్యాంగం అందరికీ కల్పించింది**

**మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్**

హుజూర్ నగర్ డిసెంబర్ 08 (వాయిస్ టుడే ప్రతినిధి) : అధికారం ఎవరికి ఎప్పుడు శాశ్వతం కాదు.. మేం కూడా 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నాం ఎప్పుడూ కూడా ఎవర్ని వ్యక్తిగతంగా వాడుకోలేదని మాజీ ఎంపీ బడుగు లింగయ్య యాదవ్ అన్నారు ఈ సందర్భంగా హుజూర్ నగర్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .ప్రజా క్షేత్రంలో ఎవరికి నచ్చినట్లు వాళ్లు పోటీ చేసే హక్కు రాజ్యాంగం కల్పించిందని ప్రజలు ఎవరికి అవకాశం ఇస్తే వాళ్లే గెలుస్తారన్నారు.అంతేకానీ భయపెట్టి ఇబ్బందులకు గురి చేసే స్వభావం కాంగ్రెస్ పార్టీ మానుకోవాలని ఆయన తెలిపారు. స్థానిక ఎన్నికల్లో గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత ఉందని అన్నారు. ఆ పార్టీకి అభ్యర్థులు లేకపోవడంతో బిఆర్ఎస్ పార్టీ వ్యక్తులని భయభ్రాంతులకు గురిచేసి వారి పార్టీ తరఫున పోటీ చేయించే ప్రయత్నం చేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ కి ప్రజలే ఓట్లతో బుద్ధి చెప్తారన్నారు.





## సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

**నిఘా నేత్రాల పర్యవేక్షణలో స్థానిక ఎన్నికలు**

**సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమంద రాజు**

హుజూర్ నగర్, డిసెంబర్ 08 (వాయిస్ టుడే ప్రతినిధి): పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమాన్ని సోమవారం హుజూర్ నగర్ మండల కేంద్రంలోని లింగగిరి గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హుజూర్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమంద రాజు మాట్లాడుతూ ఎన్నికల నియమావళి పై గ్రామంలోని ప్రజలకు పలు సూచనలు అందించారు. గ్రామంలోని ప్రజలు అల్లర్లు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే అలాంటి వ్యక్తులను ముందస్తుగా బైండ్-ఓవర్ చేయబడుతుందని తెలిపారు.ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు ఎవరైనా పాల్పడితే అలాంటి వ్యక్తులపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో అనవసరమైన మరియు తప్పుడు సమాచారం అందించే వారిపైన నిఘా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.గ్రామ పంచాయతీ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ అంతా నిఘా నేత్రాల పర్యవేక్షనలో జరుగుతుందని ఎవరైనా వ్యక్తులు గ్రామంలోని ప్రజలను ప్రలోబాలకు గురిచేస్తే 100 కాల్ చేయవలసిందిగా కోరారు. గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా అన్నీ పార్టీల వారు సహకరించాల్సిందిగా సీఐ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బండి మోహన్, పోలీస్ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నకిలీ బంగారం విక్రయ ముఠా అరెస్టు



సూర్యాపేట: నకిలీ బంగారు బిస్కెట్లు అంటగట్టి మోసగిస్తున్న నలుగురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను సూర్యాపేట గ్రామీణ పోలీసులు సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్పీ నరసింహ తెలిపారు. నిందితుల నుంచి 20 గ్రాముల ఐదు నకిలీ బిస్కెట్లు, రూ.12 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు. సూర్యాపేటలో ఎస్పీ సోమవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏపీలోని పల్నాడు జిల్లా నరసారావుపేటకు చెందిన ప్రధాన నిందితుడు నాగేశ్వరరావు అలియాస్ రాజారావు, బాల, మేడి ఆదినారాయణ, ప్రకాశం జిల్లా పెద్ద ఆరవీడు మండలానికి చెందిన కుందూరు యోగిరెడ్డి, పిట్ట నాగేంద్రరెడ్డి, ఇదే జిల్లా రాజులపాడుకు చెందిన చంద్ర, గుంటూరుకు చెందిన శ్రీనివాస్‌రావు, హుజూర్‌నగర్‌కు చెందిన ఇర్రి నరేశ్, ఖమ్మం జిల్లా వైరాకు చెందిన సుధాకర్ మొత్తం తొమ్మిది మంది ముఠాగా ఏర్పడి అమాయకులకు మాయమాటలు చెప్పి నకిలీ బంగారాన్ని తులం రూ.90వేల చొప్పున విక్రయించారు. వచ్చిన డబ్బులో పది శాతం కమీషన్ ఇస్తానని ప్రధాన నిందితుడు నాగేశ్వరరావు మిగిలిన వారికి చెప్పాడు.

హనుమకొండకు చెందిన వెంకటేశ్వరరావు, లీలా అనే ఇద్దరు బాధితులు ఈనెల 6న హోటల్ సెవన్ వద్దకు చేరుకొని రూ.18 లక్షలకు 20 గ్రాముల పది బంగారు బిస్కెట్లు (నకిలీ) కొనేందుకు అంగీకరించారు. అదేరోజు నాగేశ్వరరావు.. సూర్యాపేటలోని బాలెంల శివారులో అద్దెకు నివాసం ఉంటున్న ఇంటి వద్దకు వచ్చి రూ.12 లక్షలు చెల్లించి, ఐదు బిస్కెట్లను తీసుకొని వెళ్లారు. మిగిలిన డబ్బు చెల్లించిన తర్వాత మరో ఐదు బిస్కెట్లు ఇవ్వనున్నట్లు అంగీకరించారు. పంచాయతీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో బాధితులు చెల్లించిన డబ్బును నాగేశ్వరరావు తాత్కాలికంగా నరేశ్ వద్ద ఉంచాడు. సోమవారం ఆ డబ్బును బాలెంల సమీప ఖమ్మం జాతీయ రహదారి పైవంతెన వద్దకు తీసుకురావాలని, అలాగే బాధితులను మిగిలిన డబ్బులు అక్కడికే తేవాలని నాగేశ్వరరావు కోరాడు. ఇందులో భాగంగా నిందితులంతా బాలెంల సమీపంలోని పైవంతెన వద్దకు సోమవారం చేరుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సూర్యాపేట గ్రామీణ సీఐ రాజశేఖర్, ఎస్సై బాలునాయక్ తమ సిబ్బందితో కలిసి దాడి చేయడంతో నలుగురు నిందితులు, ఐదు నకిలీ బిస్కెట్లు, రూ.12 లక్షలు పట్టుబడ్డాయి. మిగిలిన ఐదుగురు నిందితులు పరారయ్యారు. కేసును ఛేదించిన



# బుద్ధవనం సందర్శించిన దక్షిణాసియా దేశాల రాయబారులు

**బుద్ధవనం తమనెంతో ఆకట్టుకుంది దక్షిణ ఆసియా దేశాల అంబాసిడర్లు**

నాగార్జునసాగర్, డిసెంబర్,8,: వాయిస్ టుడే ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం నాగార్జునసాగర్ లో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బుద్ధవనం వారసత్వ థీమ్ పార్క్ తమను ఎంతో ఆకట్టుకుందని దక్షిణాసియా దేశాల రాయబారులు అన్నారు.తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో పాల్గొనటానికి వచ్చిన ప్రతినిధులు మలేషియా హై కమిషనర్ ముజఫర్ షాబిన్ ముస్తఫా, నేపాల్ రాయబారి డాక్టర్ శంకర్ ప్రసాద్ శర్మ, భూటాన్ రాయబారి మేజర్ జనరల్ వెట్ సోప్ నాంగ్యెల్, థాయిలాండ్ రాయబారి చావనార్ట్ తంగ్ సుపంత్, ఆమె కార్యదర్శి రుచీ సింగ్ సోమవారం నాడు బుద్ధ వనాని సందర్శించారని బుద్ధ వనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా బుద్ధవనం ఎంట్రన్స్ ప్లాజా వద్ద వారికి తెలంగాణ సాంప్రదాయ ప్రకారం కోలాటం డప్పుల నృత్యాలమధ్య స్వాగతం పలికారు. బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య బౌద్ధ శాలువాలతో పుష్పగుచాలతో వారిని ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాయబార్ల బృందం బుద్ధ చరిత వనంలోని బుద్ధ పాదాల వద్ద, మహా స్తూపం లోని ఆచార్య నాగార్జున విగ్రహం వద్ద పుష్పాంజలి సమర్పించారు. అనంతరం సమావేశ మందిరంలో బుద్ధ వనములో నిర్మాణంలో ఉన్న బుద్దిస్ట్ డిజిటల్ ఎక్స్పీరియన్స్ మ్యూజియాన్ని, తెలంగాణలో బౌద్ధ వారసత్వం పై వీడియోలను వారు వీక్షించారు.

బుద్ధవనం ప్రత్యేకతల గురించి ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో బౌద్ధ విషయ నిపుణులు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి వారికి వివరించారు. మహా స్తూపం అంతర్భాగంలోని ధ్యాన మందిరంలో సికింద్రాబాద్ మహేంద్ర హిల్స్ లోని మహాబోధి బుద్ధ విహార సంచాలకులు బుద్ధ పాల ప్రత్యేక బౌద్ధ ప్రార్థనలు నిర్వహించిన అనంతరం బుద్ధవనం సందర్శించిన రాయబారులను ఆశీర్వదించారు. బుద్ధవనం లోని వివిధ విభాగాలను సందర్శించిన రాయబారులు మాట్లాడుతూ ఇంత పెద్ద మహాస్థూపాన్ని, దాని చుట్టూ ఉన్న వేలాది శిల్పాలను,ఎన్ని రకాల స్థూపాల నమూనాలను శ్రీలంక బుద్ధుని శిల్పాన్ని, జాతక కథ శిల్పాలను ఒక్కచోట చూడడం గొప్ప విషయమని వారు అన్నారు.1700 సంవత్సరాల తర్వాత అమరావతి శిల్పకలకు మళ్లీ ప్రాణం పోశారని మహా స్తూపం అంతర్భాగంలోని అలంకరణ తమ ఎంతో ఆకట్టుకుందని ఈ సందర్భంగా వారు తెలంగాణ ప్రభుత్వాన్ని కొనియాడారు. అనంతరం విజయ విహార్ అతిథి గృహానికి చేరుకున్న వీరికి తెలంగాణ టూరిజం హోటల్స్ జిఎం నాథన్, ఏ జి ఎం జంగయ్య రాయబార్ల బృందానికి ఘనంగా స్వాగతం పలికారు. అటు తర్వాత సుందరంగా అలంకరించిన తెలంగాణ టూరిజం లాంచీలో నాగార్జునసాగర్ జలాశయంలో విహరించారు. ఈ కార్యక్రమంలో బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన,, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర బుద్ధవనం ఆర్ట్ మరియు ప్రమోషన్స్ మేనేజర్ శ్యామసుందర్రావు, లాంచీ యూనిట్ మేనేజర్ హరి, విజయ విహార్ మేనేజర్ కిరణ్, స్థానిక సీఐ శ్రీను నాయక్, ఎస్ఐ ముత్తయ్య,, పెద్దవూర ఎస్సై ప్రసాద్ నందికొండ మున్సిపాలిటీ కమిషనర్ వేణు, రెవెన్యూ ప్రోటోకాల్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



## గన్నవరం దళితవాడ వాసుల పట్ల అధికారుల నిర్లక్ష్యం

**సిఎం ఆశయాలను నిరుగార్చుతున్న అధికారులు**

**లబోదిబోమంటున్న దళితవాడ వాసులు**

కృష్ణా జిల్లా. గన్నవరం: దళితుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు, డ్రైనేజీలు నూతన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గన్నవరం లోని చర్చి రోడ్డు నుండి గన్నవరం దళితవాడ వరకు రోడ్లు డ్రైనేజీలు నిర్మాణం జరిపారు. చర్చి రోడ్డు నుండి దళితవాడ వరకు డ్రైనేజీ నిర్మాణం జరిపారు. ఈ కాలువలో మురుగు నీరు మొత్తం దళితవాడ చేరుతుంది. డ్రైనేజీ పూర్తిగా నిర్మాణం జరపకుండా స్మశానవాటి సమీపంలో నివాసాల మధ్యలో నిలిపివేయడంతో పరిసర ప్రాంతాలు నీరు నిలిచిపోయి తీవ్రంగా దుర్వాసన వెదజల్లి దోమలు విపరీతంగా ప్రభాలుంచి జ్వరాల భారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యలో నిలిపివేసిన డ్రైనేజీ పూర్తిగా నిర్మాణం చేపట్టి సమస్యను వెంటనే పరిష్కరించాలని దళితవాడ వాసులు అధికారులను కోరుతున్నారు.

# పెద్దాపూర్ ఆదర్శ గ్రామంగా మారుస్తాం

**చేపూరి సుమలత జీవన్ రెడ్డి గెలిపించండి..**

**గ్రామ సర్పంచ్‌గా చేపూరి సుమలత జీవన్ రెడ్డి**

**సర్పంచ్‌గా సుమలతకి మద్దతు ఇవ్వడి సంజయ్ పిలుపు..**

**గ్రామానికి సేవ చేయడానికి నేను సిద్ధం సర్పంచ్ అభ్యర్థిగా సుమలత జీవన్ రెడ్డి..**

**సమస్యలను తీర్చేందుకు పూర్తి హామీ.**



మెటుపల్లి.వాయిస్ టుడే న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 8: జగిత్యాల జిల్లా మెటుపల్లి మండలంలోని పెద్దాపూర్, గ్రామంలోని ఎన్నికల ప్రచారంలో పాల్గొన ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పెద్దాపూర్ గ్రామ సర్పంచ్ గా చేపూరి సుమలత జీవన్ రెడ్డి సర్పంచ్ గా గెలిపిస్తే అనగానే వచ్చే మన జీవన్ రెడ్డి అని ఎమ్మెల్యే అన్నారు. యూరియా బస్తా రాష్ట్రంలో ఎక్కడ లేకున్నా మన పెద్దాపూర్ లో ఉండేదని తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అడగకుండానే వరాలిచ్చిన దేవుడు. టిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు చీరెలు పంచింద్రు,పింఛన్లు ఇచ్చిండు,కల్యాణ లక్ష్మి,బిడ్డలు పుడితే కెసిఆర్ కిట్టు ఇచ్చిండు కాని మన కేసీఆర్ బతుకమ్మ పండుగ కు ఆడబిడ్డలకు చీరెలు అందించేవారు.

అభివృద్ధి చేసే నాయకుణ్ణి మనం ఎన్నుకోవాలని గ్రామాల్లో బీఆరెస్ మద్దతు వాళ్లనే భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. సర్పంచ్ అభ్యర్థి మాట్లాడుతూ..పెద్దాపూర్ గ్రామ సర్పంచ్ గా చేపూరి సుమలత జీవన్ రెడ్డి ఉంగరం గుర్తు కి మీరు ఆశీర్వదించి ఓటు వేసి గెలిపించండి. ఇంతకుముందు మా భర్త చేసిన పని నాకంటే ఎక్కువ మీకే తెలుసు ఈరోజు ఇక్కడ నిలబడడానికి నేను రావడానికి మా సారు ఇప్పుడు మమ్మల్ని గెలిపించి మీ అవసరాలు ఏంటో తీర్చుకోండి. ఏ అవసరం ఉన్నా గాని మా ముందుకు అచ్చి చెప్పుకుంటే ప్రతి పని మీద మీ వెంట ఉంటూ మేము చేసి పెడతాం. ఇంకేమైనా మిగిలిన పనులు ఉంటే మేము ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ప్రతి పని చేయిస్తామని మీ అవసరాలు తీర్చే బాధ్యత మాది. మా భార్య సుమలత సర్పంచ్ అభ్యర్థిగా నిలవడం జరిగింది. ప్రజలకు ఏ సమస్యలున్న గ్రామంలో రోడ్లు, ఇల్లులు,మోరీలు,కరెంటు బోల్టు, వ్యవసాయ మార్కెట్లో బోల్టు, కొంతమంది కి పింఛన్లు, రూమ్,మూడు వాటర్ ట్యాంకులు మా నాన్నగారి జ్ఞాపకర్తంతో చేయించడం జరిగింది. ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా ఫోన్ తోనే ముందుండి పని చేస్తానని మాటిస్తున్నాను. మమ్మల్ని ఆశీర్వదించి గెలిపించాలని ప్రార్థిస్తున్నాను..